# ఉపనయనము



శ్రీ దత్తస్వామి విరచితము

## శ్రీదత్తస్వామి విరచిత ...

# ఉపనయనము



తమ కుమారుడైన **చి. వేంకట కార్తికేయ శంకర దత్త**

ఉపనయన శుభసందర్భముగా -

**శ్రీ శిష్లా వేంకట లక్ష్మీకాంత్, శ్రీమతి అరుణ** దంపతులచే

శ్రీ దత్తసేవలో ముద్రితములు.

**For knowledge of Shri DattaSwami please visit**
**https:// www.universal-spirituality.org**

© 2020. Copy rights reserved

**ప్రతులకు**

-శ్రీ దత్త జ్ఞాన ప్రచార పరిషత్

డోర్ నెం. 23-11-1/2, సత్యనారాయణపురం, విజయవాడ-520 011

చరవాణి : 9000179292 **Rs. 30-00**

# కవి పరిచయం

*శ్రీ దత్తస్వామి (శ్రీ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి గారు) తమ 16 సంవత్సరాల వయస్సులోనే సంస్కృతములో 100 గ్రంథములకు పైగా ఆధ్యాత్మికములో, శంకర–రామానుజ–మధ్వ మతత్రయ సమన్వయమును చేస్తూ రచించినారు. వీరు 19 సంవత్సరాల వయస్సులో కెమిస్ట్రీలో పి. హెచ్.డి.ని పొంది ప్రొఫెసరుగా పనిచేసినారు. వీరి వేదాంత ఉపన్యాసములు ఆంగ్లములో పదమూడు సంపుటములలో ముద్రణలో ఉన్నవి. వీరి సంస్కృత గ్రంథములు కొన్ని తెలుగు అనువాదములో ఇప్పటికే ముద్రించ బడినవి. (శ్రీ దత్త గురు భగవద్గీత, శ్రీ దత్తోపనిషత్తులు, శ్రీ కృష్ణ భాగవతమ్, దత్తాత్రేయము ...మొదలగునవి) వీరు లోకదృష్టిలో శ్రీ దత్తాత్రేయస్వామి ఉపాసకులు. వీరి ఆత్మీయ భక్తుల దృష్టిలో సాక్షాత్ శ్రీ దత్తాత్రేయ స్వరూపులు. ప్రస్తుత గ్రంథములో ఉపనయనము మరియు గాయత్రియొక్క సత్యమైన అర్థములను వీరు ప్రకాశింపజేసినారు.*

**దశిక శ్రీ కృష్ణ సూర్యనారాయణ మూర్తి**
(అజయ్),
**శిష్ట్లా ఫణికుమార్**

శ్రీదత్తస్వామి విరచిత

# ఉపనయనము

## మౌలిక ప్రశ్న - సమాధానము :

**పూర్వపక్షి :-** ఉప = భగవంతుని సమీపమునకు ఆరాధన మరియు సేవ ద్వారా నయనము = సమీపించుట అని అర్థము కావున సర్వ మానవులకు ఇది వర్తించును. తండ్రియగు భగవంతుని చేరుట సర్వమానవులకును సమానాధికారమున్నది కావున, దీనిని కొన్ని కులములకే పరిమితము చేయుటచేత ప్రాచీన ఋషుల పక్షపాతధోరణి గర్హింపదగినది. అత్రి ఋషిపుత్రుడైన శ్రీదత్తాత్రేయస్వామి ఋషివంశీయుడగుట చేత దీనికి సమాధానమునీయవలసియున్నది.

**సిద్ధాన్తి :-** ఊహలకు సైతము అందని పరబ్రహ్మము అత్రి ఋషికి పుట్టిన ఒక నరశరీరమును ప్రవేశించియున్నది. జ్ఞాన ప్రచారము చేయుటకు ప్రవేశించిన నరశరీరముతో తాదాత్మ్యమును చెందిన అంతర్గత పరమాత్మ దృష్ట్యా - ఆయన కుల, లింగ, దేశ, కాలాదులకు అతీతుడు. సత్యజ్ఞానమును ప్రచారము చేయుటకు (సత్యంజ్ఞానం-శ్రుతి) దత్తస్వామి అను పేరుగల యీ మానవశరీరమును ప్రవేశించిన పరమాత్మ కుల - లింగ పక్షపాతము కలిగి ఉండజాలడు. ఇప్పుడు చెప్పుచున్న యీ దివ్యజ్ఞానములో ప్రతి శబ్దము ఆయన నుండియే వచ్చుచున్నది. ఆ పరమాత్మయే నీచేత కూడా ఈ ప్రశ్న వేయించినాడని గ్రహించుము. విశ్వంలోని మానవులందరి శ్రేయస్సు కొరకు ఎట్టి పక్షపాతము లేక సద్బ్రాహ్మణులైన ప్రాచీన ఋషులు పరమాత్మచేత వేదముల ద్వారా ప్రకాశింపచేయబడిన సత్యజ్ఞానమును ప్రచారము చేసినారు. ఆ పరమాత్మను గానము ద్వారా తన మాతృభాషలో స్తోత్రము చేసి కుల - లింగ భేదరహితముగా భగవంతుని చేరుటయే గాయత్రి శబ్దార్థము. దీనికి సర్వమానవులును అధికారులే నన్న సందేశమే ఉపనయనమున కలదు. ఈ ఉపనయన సంస్కారము, పరమాత్మను ఏ రీతిలో ఉపాసించవలయునో, మరియు ఆ పరమాత్మ యొక్క

ఏ రూపమును సేవించవలయునో వివరించుచున్నది. కావున ప్రచారము చేయవలసిన జ్ఞాన విద్యాంశములను బోధించుటయే ఉపనయన సారాంశము. ఇది భగవంతుని ఆరాధించు ఒకానొక విశిష్ట స్తోత్రము కాదు. కావున కొందరికే పరిమితము చేయుటచేత ఇతరులకు అన్యాయమును చేసినారను ఆక్షేపణ ఇచ్చట పొసగదు. ఇది కేవలము ఉపాస్యరూప వివరణము మరియు ఉపాసనరీతి వివరణము. ఇది భగవదారాధనము కానేకాదు. కావున ఎవరును భగవదుపాసన అవకాశము జారిపోవుట వలన నష్టము జరిగినదని అపార్థము చేసుకొనరాదు. ఈ ఉపనయనము యొక్క నిశితమైప విశ్లేషణ ద్వారా ప్రాచీన ఋషులు యీ సత్సంప్రదాయ స్థాపనలో ఎటువంటి అన్యాయ పక్షపాతమును చేయలేదని స్పష్టమగును. ఈ సందేశము ద్వారా శ్రీదత్తాత్రేయస్వామి వారు తన కులమును సమర్థించుకొనుచున్నారని అపార్థము చేసుకొనవలదు. ఈ సందేశములో ముందు సద్బ్రాహ్మణులగు తన కులము వారైనఋషులను సమర్థించి, ఆ తరువాత వేదములోని ఒక్క శబ్దమును కూడ అర్థముచేసుకొనక, కేవలము గుడ్డిగా యంత్రములవలె వేదములను బట్టీపట్టి, ప్రాచీన సత్సంప్రదాయ భావములను మరుగుపరచి,హిందుమతములోని చీలికలకు కారణములైన తమ దురహంకార - అజ్ఞాన భావములను ప్రచారము చేసిన బట్టీబ్రాహ్మణులను ఖండించబోవుచున్నారు. ఈ దత్తాత్రేయ స్వామి వారు జ్ఞానములో కేవలసత్యమునే ప్రకాశింపచేయుదురే తప్ప, దానివలన ఒకరు గౌరవింపబడినను, మరియొకరు అవమానించబడినను, దానిని వారు లెక్కచేయరు. కావున పాఠకులు కుల - లింగస్థాయిలకు అతీతులై భగవంతుని నుండి ప్రకాశించు యీ సత్యమును అర్థముచేసుకొనుటలో జాగ్రత్తగా నుండవలయునని హెచ్చరిక చేయబడుచున్నది.

ఉపనయన సారాంశమును గ్రహించుటకు ముందు గాయత్రీమన్త్రమనగా - ఎవరైనను తమ మాతృభాషలో అర్థము చేసుకొనుచు పాడవలసిన దైవస్తుతి గానమనియే. గానమే సామవేదము, పద్యమే ఋగ్వేదము, గద్యమే యజుర్వేదము. సామవేదమునుండి క్రిందికి వచ్చుకొలది ఆకర్షణము తగ్గును. గీతలో చెప్పినట్లు (వేదానాంసామవేదోఽస్మి). గీతము అన్నిటికన్నను అధిక - ఆకర్షణము కలది. గీతఅను పేరు యొక్క అర్థము కూడా భగవంతునిచే గానము చేయబడినది అనియే.

అయితే గాయత్రీమన్త్రమును ఎవరు గానము చేయుటలేదు. కావున ఇది గానములోనున్న దైవ స్తుతి కాదు. మరి, యిది గాయత్రి అని ఎందుకు పిలువబడుచున్నది? అనగా ఇది గాయత్రి అను పేరుగల ఒకానొక వైదిక ఛందస్సులో రచింపబడుట చేత అని గ్రహించవలయును. ఇందులో ధ్యానించి ఆరాధించి సేవించబడవలసిన దైవస్వరూపము వివరించబడినది. శార్దూలవిక్రీడితము, చంపకమాల, ఉత్పలమాల మొదలగు లౌకిక ఛందస్సుల పేర్లువలె, గాయత్రి. బృహతి, జగతి మొదలగు పేర్లతో వైదిక ఛందస్సులు కలవు. గాయత్రీమన్త్రమును తీసుకున్నప్పుడు గాయత్రి శబ్దమును కేవలము ఛందస్సు నామముగా (రూఢి) తీసుకొనవలయునేతప్ప, ఆ శబ్దముయొక్క వ్యుత్పత్తి అర్థమును (యోగ) తీసుకొనరాదు. రూఢియనగా శబ్దార్థమును విచారింపకయే శబ్దమును ఒక పదార్థమునందు పేరుగా నిర్ణయించుట. యోగమనగా ఒక శబ్దము యొక్క వ్యుత్పత్తి. యోగరూఢమనగా వ్యుత్పత్తి ద్వారా పదార్థమునకు ఆ శబ్దమును పేరుగా నిర్ణయించుట. ఈ విధముగా గాయత్రీ మన్త్రమును రూఢిపరంగా తీసుకున్నను, గాయత్రి శబ్దము ద్వారా అట్టి స్వరూపమును గానరూపంలో స్తుతించవలయునని (యోగ) గ్రహించవలయును. దీని యోగార్థము - గాయన్తం త్రాయతే ఇతి - అనగా దైవమునుండి గానస్తుతి ద్వారా రక్షణము లభించుట. కావున గాయత్రీమన్త్రమును కేవలము రూఢిగా తీసుకొని, దాని యోగపరమైన అర్థమును నిర్లక్ష్యము చేయుట సరికాదు. గాయత్రీ మన్త్రార్థము రూఢిపరంగా - ఆరాధన చేయవలసిన దైవరూపమును గురించిన బోధ. అదే యోగపరంగా - ఆ దైవమును గానముతో స్తుతించుట అని రెండు విధములుగా గ్రహించవలయును. దైవరూపము యొక్క జ్ఞానమును బోధించుటచేత ఇది జ్ఞానప్రకరణయే తప్ప, ఒకానొక విశిష్టస్తుతి రూపంలో భక్తిని కలగచేయు ఉపాసన ప్రకరణము కాదు. అయితే ఉపాసనరూపమైన ఏ స్తుతియైనా గానరూపంలో ఉండాలనే సూచనను మాత్రము ఇది చేయుచున్నది.

**రూఢ - యోగరూఢ శబ్దములు :**

కావున రూఢము, యోగరూఢము అను రెండు శబ్దములను చక్కగా తెలుసుకొన్నచోహిందూమతములో ఐక్యత మరల వచ్చును. రూఢము అనగా శబ్దము యొక్క అర్థము అన్వయించకపోయిననూ, ఆ శబ్దమును కేవలము పేరుగా పిలచుటకు

మాత్రము ఉపయోగించునట్లుగా పెట్టుట. ఉదా :: బ్రాహ్మణ శబ్దమునకు అర్థము జనులను జ్ఞానబోధ ద్వారా పరమాత్మ వద్దకు చేర్చుట. బ్రాహ్మణ కులములో పుట్టిన ఒకడు ఈ పనిని చేయుటలేదు. కావున బ్రాహ్మణశబ్దము అతడిలో అన్వయించదు. కానీ బ్రాహ్మణశబ్దార్థము అన్వయించిన ఋషుల వంశములో పుట్టినాడు కావున తమ అట్టి వంశమునకు బ్రాహ్మణశబ్దమును అర్థ సమన్వయముతో పనిలేక పేరుగా బ్రాహ్మణశబ్దము పెట్టబడినది కావున అతడిని బ్రాహ్మణుడని పిలచుట రూఢి. అలానే శూద్రుడు అనగా ఐహికములను గురించి సదా చింతించువాడు అని అర్థము. ఒకడు అలా చింతించుటలేదు కావున అర్థము రీతిగా శూద్రుడుకాడు. కానీ మొదట అలా చింతించినవారి కులమునకు అర్థముతో పనిలేక శూద్రశబ్దము పేరుగా వాడబడినది. ఆ కులములో పుట్టిన ఇతడిని శూద్రుడని పేరుగా పిలచుట రూఢి.

యోగము అనగా శబ్దము యొక్క అర్థ విశ్లేషణము. ఒకడు బ్రాహ్మణకులములో పుట్టకపోయిననూ బ్రాహ్మణశబ్దార్థమైన పనిని చేయుచున్నాడు కావున వానిని బ్రాహ్మణుడనుటచేత యోగము సమన్వయించిన యౌగిక శబ్దముచే పిలువబడుచున్నాడు. యౌగికశబ్దము సమన్వయించునపుడు అనేక యౌగికములు ఉండవచ్చును. ఉదా :: పంకజము అనగా బురదనుండి పుట్టినది అను అర్థము యోగము. బురదనుండి పుట్టిన శంఖము మరియు పద్మము రెండునూ యౌగికములే. కానీ ఈ రెండు యౌగికములలో పద్మములోనే పంకజశబ్దము నిర్ణయింపబడినది కావున పద్మమును చెప్పు పంకజశబ్దము యోగరూఢము. కానీ శంఖమును చెప్పు పంకజశబ్దము యౌగికమేకానీ యోగరూఢము కాదు. సందర్భమునుబట్టి శబ్దము యౌగికమా, యోగరూఢమా లేక కేవల రూఢమా అనునది నిర్ణయించవలెను. ఇక యౌగిక రూఢము అను నాల్గవ వర్గమునకు చెందిన శబ్దము ఒకానొక అర్థములో ఒకానొక శబ్దమును వేదములో నిర్ణయింపబడినది. ఇది లౌకిక వాఙ్మయములో అప్రస్తుతము.

**రూఢము :**రూఢమనగా శబ్దము యొక్క అర్థమును ఏ మాత్రము విచారింపక కేవలము పిలుపుకోసము అర్థము తెలియని ఒక శబ్దమును పేరుగా పెట్టుకొనుట. ఉదా., 1. సత్యహరిశ్చంద్ర : ఒక బాలునకు పుట్టినప్పుడు సత్యహరిశ్చంద్రుడని

పేరు పెట్టినారు. వాడు పెరిగిన తరవాత నిత్యము అసత్యములనే చెప్పెడివాడు. వానిని చివరివరకు సత్యహరిశ్చంద్రుడనియే జనులు పిలచిరి. 2. ఉపనయనము : ఇది బాలురకు చేయబడుచున్న ఒక సంస్కార కర్మ. ఇందులో బోధించబడిన జ్ఞానము ఎవరికినీ తెలియదు. ఇది కేవలము వారి కులమునకే పరిమితమైన ఒక దైవ ఉపాసనావిధానము అని ప్రచారము చేసి, గాయత్రీచంధస్సులో నున్న ఒక మన్త్రమును గాయత్రిగా భావించి గానము చేయక మాటిమాటికీ జపింతురు. కావున ఉపనయన శబ్దము అర్థరహితమైన ఈ మొత్తము కర్మను పిలచుటకు పేరుమాత్రమే. 3. గాయత్రి : దీని అర్థము తెలియనందున గానము లేదు. గాయత్రీ ఛందస్సులో ఉన్న ఒక మన్త్రమే గాయత్రి. దీనిని ఒక స్త్రీరూప దేవతగా భావించి ఈ పేరుతో పిలచుట. 4. సవిత : అర్థముతో పనిలేక ఆకాశములోనున్న సూర్యుడని భావించుట. 5. అగ్ని : అర్థవిచారము చేయక కట్టెలతో మండు లౌకికాగ్నిని ఈ పేరుతో పిలచుట. 6. యజ్ఞము : లౌకికాగ్నిలో నేతిని పోసి దగ్ధము చేసి దానిని దేవతలకిచ్చిన ఆహారముగా భావించుట. 7. హోమము : లౌకికాగ్నిలో నేతిని పోసి దేవతలకు సమర్పించుట. 8. బ్రాహ్మణ : శబ్దార్థముతో పనిలేక కేవలము ఋషులవంశములో పుట్టినవారిని పిలచుట. 9. శూద్ర : శబ్దార్థముతో పనిలేక కేవలము సంఘసేవా విధిని నిర్వహించు ఒక కులమును పిలచుట. 10. మ్లేచ్ఛ : శబ్దార్థముతో పనిలేక కేవలము ముస్లీం జాతివారిని పిలచుట.

**యోగరూఢము :** శబ్దార్థమును విచారించి ఆ అర్థము సమన్వయము జరుగు పదార్థమునే ఆ శబ్దముతో పిలచుట. 1. సత్యహరిశ్చంద్ర : ఒక వ్యక్తి నిత్యము సత్యమునే పలుకునపుడు గమనించి అతనిని సత్యహరిశ్చంద్రుడని పిలచుట. **2. ఉపనయనము** : దీని అర్థము స్తుతిసేవల ద్వారా భగవంతునికి దగ్గర అగుట. మాతృభాషలో స్తుతి గానమును చేసి వంటను వడ్డించి సేవించి సద్గురుదేవునినుండి బ్రహ్మజ్ఞానమును గ్రహించు క్రియ. **3. గాయత్రి** : మాతృభాషలో భక్తితో సద్గురుదేవుని స్తుతిని పాడుట. **4. సవిత** : సృష్టికర్తయైన పరమాత్మ జ్ఞానబోధ చేయుటకు అవతరించిన సద్గురురూపము. **5. అగ్ని** : మొట్టమొదట (అగ్రి) అర్చించవలసిన, జ్ఞానాగ్నితో ప్రకాశించు సద్గురుదేవుడు. గురుసేవలో వంట చేయుటకు ఉపయోగించబడు కట్టెలతో మండు లౌకికాగ్నిని, గురువుయొక్క

కుక్షిలో ఆకలిమంటగా మండు వైశ్వానరుడనబడు దేవతాగ్నిని సందర్భానుసారముగా తీసుకొనవలెను. **6. యజ్ఞ** : అనగా పూజించుట. ద్రవ్యయజ్ఞములో సద్గురువుకు దక్షిణనిచ్చుట. తపోయజ్ఞములో (భక్తియోగ) ఆవేశముతో గురుస్తుతిగానము చేయుట. యోగ (కర్మయోగ) యజ్ఞములో వంటచేసి గురువుకు అర్పించుట మొదలగు సేవలు. స్వాధ్యాయజ్ఞాన (జ్ఞానయోగ) యజ్ఞములో సద్గురువునుండి వేదార్థపరమైన బ్రహ్మజ్ఞానమును పొందుట. ఇవి గీతలో చెప్పబడిన యజ్ఞములు. పంచయజ్ఞములు కూడా సద్గురువును (బ్రహ్మ), భక్తులను (దేవ), తల్లిదండ్రులను (పితృ), ఆకలిగొన్నవారిని (మనుష్య) మరియు సాధు పశు పక్ష్యాదులను (భూత) తృప్తిపరచుట. **7. హోమ** : ఆకలిగొన్న వారి జఠరాగ్నియగు వైశ్వానర దేవతాగ్నికి ఘృతముతో కలిపి వండిన వంటను అర్పించుట. **8. బ్రాహ్మణ** : ఏ కులములో పుట్టినవాడైనను సర్వజనులను బ్రహ్మజ్ఞానబోధ ద్వారా దైవమువద్దకు చేర్చువాడు. **9. శూద్ర** : ఏ కులములో పుట్టిన వాడైనను ఐహిక జీవనభృతి చింతను కలిగి సంఘసేవలను చేయువాడు. **10. మ్లేచ్ఛ** : ఏ కులమువాడైనను నాస్తికుడై మతగ్రంథములను నిందించువాడు.

## గాయత్రీ మన్త్రార్థము :

ఈ పూర్వ రంగముతో గాయత్రి అని పేరుగల ఛందస్సులో రచింపబడిన గాయత్రి అను వేద మన్త్రము యొక్క అర్థమును ముందు మనము విశ్లేషించవలయును.

**గాయత్రీ మన్త్రము - ఓం భూర్భువస్సువః । తత్సవితుర్వరేణ్యం । భర్గోదేవస్య ధీమహి । ధియోయోనః ప్రచోదయాత్ ।**

ఓమ్ = ఇది అనూహ్య పరబ్రహ్మమును సూచించుచున్నది. (తస్యవాచక: - బ్రహ్మసూత్ర). ఇది సృష్టిస్థితిలయ కారకులగు బ్రహ్మ, విష్ణు , శివులను సూచించు అకార - ఉకార - మకారములయొక్క మిశ్రమము. ఇది అనూహ్య సృష్టికర్తకు ప్రతినిధి.

**భూర్భువస్సువః** = (ఈ మూడు శబ్దములు వ్యాహృతులనబడును). ఇవి ఊహించుటకు వీలగు యీ సృష్టి యొక్క మూడు ఘటకపదార్థములను బోధించును.

**భూః** (భూలోకము) అనగా విష్ణుశక్తి రూపమైన లక్ష్మీ తత్త్వమగు జడద్రవ్యము. **భువః**

(భువర్లోక/ద్యులోక/జ్యోతిర్లోకము) – శివశక్తి రూపమైన పార్వతీ తత్త్వమగు జడశక్తి. **సువః** (సువర్లోక/స్వర్లోక/స్వర్గలోకము) అనగా చైతన్య వికారములగు త్రిగుణముల రూపములగు కోరికలను నెరవేర్చుభోగలోకమును సూచించు బ్రహ్మశక్తి రూపమైన సరస్వతీ తత్త్వమగు చిత్‌శక్తి. ఈ మూడు బ్రహ్మాండ/పిండాండ రూపమగు నరశరీర – ఉపాధి స్వరూప పదార్థములు. బ్రహ్మాండములోను, నరశరీరమగు పిండాండములోను తొమ్మిది ప్రకృతులే కలవు (ఎనిమిది అపరాప్రకృతులు, ఒక పరాప్రకృతి -- గీత). నరశరీర – ఉపాధిలోకి పరమాత్మ ప్రవేశించి, దానితో తాదాత్మ్యమును చెంది భక్తకోటికి జ్ఞాన ప్రచారమును చేయును.

**దేవస్య =** క్రీడార్థము సృష్టిని చేసి రమించుచున్న / అనూహ్యుడైననూ సృష్టిద్వారా తాను కలనని తనను ప్రకాశింప చేసుకొనుచున్న ('ఏకాకీనరమతే' అను శ్రుతి ప్రకారము ఒక్కనిగా ఉన్న తనయొక్క రమణము కొరకే సృష్టిని చేసినాడని అర్థమును కానీ, లేక ఊహించుటకు వీలగు సృష్టిభాగమైన నరశరీర ఉపాధి ద్వారా అనూహ్యుడైన తాను ప్రకాశించుచున్నాడు అనగా వ్యక్తమగుచున్నాడు అని అర్థమును కానీ తీసుకొనవచ్చును).

**తత్సవితుః =** ఆ సృష్టికర్త యొక్క (యోగముద్వారా సవిత అనగా సృష్టికర్త) రూఢిద్వారా సవిత అనగా సూర్యుడు. రూఢి సిద్ధుడైన సూర్యుడుకాదని, యోగసిద్ధుడైన పరమాత్మయేనను అర్థమును 'ఆ' (తత్) అనుపదము సూచించుచున్నది.

**వరేణ్యం భర్గః =** శ్రేష్ఠమైన సృష్టిభాగము. భర్గ: అనగా తేజస్సు లేక శక్తి. ఆ శక్తికార్యమే ఈ సృష్టి కావున భర్గః అనగా సృష్టి అనినేరుగా అర్థము ఏర్పడును. ఇట్టి యీ సృష్టిలో శ్రేష్ఠమైన భాగము, గీత చెప్పినట్లు పరాప్రకృతి అనగా చైతన్యము. అయితే యీ చైతన్యము స్వతంత్రముగా సృష్టిలో లభించదు. అది ఒక శరీరమును ఆశ్రయించియే గోచరించుచున్నది. ఈ చైతన్యము పైన చెప్పినట్లు సువ: అను శబ్దముచేత చెప్పబడినది. చైతన్యమువెంటనుండు జడశరీరభాగములగు భూ: (జడద్రవ్యము)మరియు భువః (జడశక్తి) ఎల్లప్పుడును సువః (చైతన్యము)తో చేరియుండుటవలన, సువః అనగానే భూః మరియు భువః కూడ గోచరించును. సువ: (చైతన్యము) లేకుండా భూః (జడద్రవ్యము) మరియు భువః (జడశక్తి) కలిసిగానీ విడివిడిగా కానీ గోచరించవచ్చును. కానీ సువః (చైతన్యము) వెంట భూః మరియు

భువః కలిసి గానీ విడివిడిగా కానీ గోచరించును. కావున సువః (చైతన్యము) వెంట భూః మరియు భువః కలిసి ఉండవలసినదే కావున చైతన్యము అనగానే చైతన్యముతో కూడిన ప్రాణి శరీరమనియే సిద్ధించుచున్నది.

**ధీమహి =** ధ్యానించుచున్నాము. ఇప్పటివరకు సిద్ధించిన సారాంశమేమనగా – అనూహ్యుడగు పరమాత్మ ఒక ప్రాణిశరీరమును ప్రవేశించి దానితో తాదాత్మ్యమును చెందును. చైతన్యములేని జడపదార్థములలోనికి పరమాత్మ ప్రవేశించడు (నతస్యప్రతిమా – శ్రుతి) అనియు స్పష్టము. అనగా – జడపదార్థములను దైవమునకు ప్రతీకలుగా సామాన్యులు ఉపాసించిననూ, దైవమును సాక్షాత్తుగా ఉపాసించుమార్గము కేవలము చేతన పదార్థములలోనే అవకాశమున్నది. ఇప్పటివరకు తాత్పర్యమేమనగా – అనూహ్యుడైన పరమాత్మను నేరుగా ధ్యానించి సేవించలేవు. ఆయన ఒక ఉపాధిని ప్రవేశించి దానితో తాదాత్మ్యమును చెందినపుడు దానిని (భర్గః) మాత్రమే ధ్యానించి సేవించగలవు.

**నః =** మాయొక్క, **ధియః =** బుద్ధులను, **యః** = ఉపాధిని ప్రవేశించిన ఏ పరమాత్మ, **ప్రచోదయాత్** = ప్రేరేపంచగలడో (అట్టి పరమాత్మ యొక్క ఉపాధిని ధ్యానించుదుము). బుద్ధికోశము మాత్రమే విన్న జ్ఞానమును బాగుగ విశ్లేషణ చేసి సత్యనిర్ణయములను చేయకలదు. ఈ భాగము ద్వారా చేతనశరీరులగు పశు పక్ష్యాదులు పరమాత్మ ఉపాధులు కావని స్పష్టము. ఏలననగా అవి జ్ఞానబోధ చేయలేవు. గీతలో చెప్పినట్లు కేవలము సద్గురువగు ఒకానొక చేతన శరీరము మాత్రమే జ్ఞాన ప్రచారము చేయగలదు (మానుషీంతనుమాశ్రితమ్). కృష్ణ, శంకర, రామానుజ, మధ్వ – ఆది సద్గురువులే సమర్థవంతంగా జ్ఞాన బోధ చేయగలరు. ఈ ఉపనయనమును సద్గురువు వద్దకు బ్రహ్మచర్యాశ్రమము కొరకు పంపుటకు ముందు జరుపు ఆచారము కూడా ఇట్టి ఉపనయనార్థమును సమర్థించుచున్నది. బుద్ధియొక్క నిశిత విశ్లేషణ చర్యను సంతృప్తిపరచ గల విశిష్టజ్ఞానమే ప్రజ్ఞానము కావున, అట్టి ప్రజ్ఞాన బోధకుడే పరమాత్మయని గుర్తించవలయునని వేదము (ప్రజ్ఞానంబ్రహ్మ).

## గాయత్రీమన్త్ర సారాంశము :

గాయత్రీ మన్త్రమును రెండు భాగములుగా విభజించ వలయును.

1) ఓం..... సువః –– ఓంకారము అనూహ్యుడైన పరబ్రహ్మమును, మూడు వ్యాహృతులు

జగత్తును సూచించును. జన్మాద్యస్య యతః అను బ్రహ్మసూత్రము ప్రకారముగా జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములద్వారా పరబ్రహ్మము (అస్తీత్యేవ – వేద) ఉన్నదని మాత్రమే తెలియుచున్నది తప్ప దాని స్వరూపలక్షణము ఏమియు తెలియుటలేదు. పరబ్రహ్మము ఉన్నది అని మాత్రమే ఓంకారము మరియు మూడు వ్యాహృతులు చెప్పుచున్నవి. ఇందులో జగత్తు ద్వారా దాని కర్త, భర్త మరియు హర్తయగు (బ్రహ్మ, విష్ణు, శివాత్మకమగు శ్రీదత్తాత్రేయ స్వరూపము) పరబ్రహ్మము అనుమాన ప్రమాణముద్వారా ఉన్నది అని మాత్రమే సిద్ధించును. ఇందులో దూరమునుండి పొగను చూచి అచట నిప్పు ఉన్నది అని అనుమానించబడును. పొగయొక్క స్వరూపము వలన నిప్పుయొక్క స్వరూపము తెలియదు. కేవలము నిప్పు ఉన్నది అని మాత్రమే తెలియును. 2) తత్సవితుః.....ప్రచోదయాత్ -- ఇట్లు ఉన్నది అని తెలియబడిన పరబ్రహ్మమును దర్శించి, సంభాషించి, స్పృశించి దానితో సహవాసమును చేయు నాలుగు మహాభాగ్యములను కోరు భక్తుల కొరకు, ఆ పరబ్రహ్మము జగత్తు (బ్రహ్మాండము) లోని శ్రేష్ఠ భాగమైన విశిష్ట నరశరీరమును (పిండాండమును) ప్రవేశించి (తదేవానుప్రావిశత్ – వేద, మానుషీంతనుమాశ్రితమ్ – గీత) సద్గురువుగా జ్ఞాన ప్రచారకునిగా భక్తుల ప్రార్థనను నెరవేర్చుచున్నది. బ్రహ్మాండ పిండాండములలో పరిమాణ భేదముతప్ప ఘటకపదార్థముల భేదములేదు. రెండింటిలోను ఒకే అనూహ్య పరమాత్మ కలడు. రెండును ( బ్రహ్మాండ పిండాండములు) శక్తి లేక ప్రకృతి లేక జగత్తు యొక్క పూర్ణ మరియు అంశ రూపములే. అనూహ్య పరమాత్మను వేదాంతమతము బోధించును. శక్తిని (బ్రహ్మాండ పిండాండములను) శాక్తేయ మతము బోధించును. 'అమ్మద్వారానే అయ్యను చేరగలము' అను వాక్యములో అమ్మయనగా శక్తి లేక ప్రకృతి. అయ్య అనగా అనూహ్యుడైన పరమాత్మ. అనూహ్య పరమాత్మను సేవించవలయునన్నచో ఊహించుటకు వీలగు సృష్టి భాగమైన నరశరీర ఉపాధి కావలయును. అట్టి ఉపాధితో పరమాత్మ తాదాత్మ్యమును చెందును కావున ఆ ఉపాధిని సేవించుట అనగా సాక్షాత్తు పరమాత్మను సేవించుటయే. ఇట్టి తాదాత్మ్యము జగత్తుతో పరమాత్మకు ఉండదు కావున జగత్తులో ఏ భాగము పరమాత్మ కాదనియే తాత్పర్యము (నేతి నేతి – వేద). ఈ జగత్తు బ్రహ్మము అను వేదవాక్యములో (సర్వంఖల్విదమ్) జగత్తు

పరమాత్మ అధీనములో ఉన్నది అని తీసుకొనవలయును (తదధీన ప్రథమా విభక్తి). లేకున్నచో పై వేద వాక్యమునకు విరోధము వచ్చును. జగత్తు ద్వారా పరమాత్మ ఉన్నాడని తెలియుటయే తప్ప జగత్తును సేవించుట ద్వారా పరమాత్మను సేవించుట కుదరదు. జగత్తులో ఒక భాగమగు నరశరీర ఉపాధితో తాదాత్మ్యమును చెందినందున పరబ్రహ్మము ప్రత్యక్షముగ కనపడుచున్నది. కావున ఇది ప్రత్యక్ష ప్రమాణము (ప్రత్యగాత్మానమైక్షత్ – వేద).

## సవిత పరమాత్మయే సూర్యుడు కాదు:

"వేదము సూర్యుని బ్రహ్మముగా ఉపాసించమని చెప్పుచున్నది (ఆదిత్యంబ్రహ్మ ఇతి....) కావున యిచట సూర్యోపాసనమే విషయము. సూర్యుని నేరుగాచూచుట కష్టము కావున సూర్యతేజస్సును ఉపాసించుము" అనియే గాయత్రీమన్త్రము యొక్క అర్థముగా మీరు వాదించరాదు. సద్గురువు యొక్క జ్ఞానశక్తియే జ్ఞాన ప్రదాయకము కాని జడమైన సూర్యతేజస్సు జ్ఞానము నీయజాలదు. నీవు చెప్పిన వేదవాక్యమును నీవు అపార్థమును చేసుకున్నావు. సూర్యుని బ్రహ్మముగా భావించి ఉపాసించమనియే యీ వేదవాక్యార్థము. అలా భావించుటను 'ఇతి' అను శబ్దము సూచించుచున్నది. పైగా, వేదము స్పష్టముగా "నీవుఉపాసించు సూర్యుడు నిజముగా బ్రహ్మము కాదు" అనియే పలుకుచున్నది (నేదంతత్......). నిజముగా సూర్యుడే బ్రహ్మమైనచో, 'ఇతి' అను శబ్దము అచట ఉండరాదు. ఒక సామాన్యుడు సూర్యుని దైవప్రతీకగా భావించి ఉపాసించవచ్చునుకాని, అంత మాత్రమున సూర్యుడు సాక్షాత్తుగా దైవము కాదు. సూర్యుని ప్రత్యేక దర్పణములద్వారా నేరుగా చాలాసమయము చూడవచ్చును. కావున సూర్యుని, ఊహలలో సైతము చూచుటకు వీలుగాని అనూహ్యపరమాత్మతో పోల్చలేము. రూఢిద్వారా సవిత శబ్దమును సూర్యుడని తీసుకొనవచ్చును. మానవుల అజ్ఞాన నిద్రా తమస్సును పోగొట్టి జ్ఞానగ్రహణమునకు సూర్యుడు సహకరించుచున్నాడు. సూర్యతేజస్సు ఇట్లు సహకరిస్తున్నది కావున రెండవ అర్థముగా తీసుకొనవచ్చును. ముఖ్యార్థములో యోగము ద్వారా సవిత అనగా సృష్టికర్తయగు పరమాత్మ అనియే అర్థమును గ్రహించవలెను. మొత్తము మీద దీని అర్థమును సూర్యోదయమున జ్ఞాన ప్రదాతయగు సద్గురువును సేవించి ఉపాసించుట అని తీసుకొనవచ్చును.

**ఆక్షేపణలు - సమాధానములు :**

ఉపాసించవలసిన లక్ష్యస్వరూపమగు సద్గురువును, ఉపాసన విధానమైన స్తోత్రము గానముగా ఉండవలెనని వివరించు గాయత్రీ మన్త్రము గాన రూపముగా ఉండవలసిన అవసరము లేదు. "నీవు పాడుము" అని చెప్పు మాటకూడా పాటగా పాడనవసరములేదు కదా. "ఈ మన్త్రమును బ్రాహ్మణులే ఏల జపింతురు?" అని నీవు ఆక్షేపించ పనిలేదు. ప్రచారము చేయవలసిన ముఖ్యమైన జ్ఞానాంశవిషయమును మాటిమాటికి స్మరించుటయే జపము. ఆనాడు సంస్కృతము సర్వజన మాతృభాష కావున ఈ విషయము సంస్కృతములోనున్నను అందరికి తెలిసినందున బ్రాహ్మణులను ఎవరును అపార్థము చేసుకొనలేదు. "స్త్రీలు, శూద్రాదులు సంస్కృత నిషేధము వల్ల ప్రాకృతమే (దేశీయభాష) మాట్లాడుచుండిరి కావున సంస్కృతములో విషయములు ఆనాడు కూడ అందరికి తెలియవు" అని నీవు పలుకరాదు. ఏలననగా - ఈ దుష్ట సంప్రదాయమును మధ్యకాలీనులగు బట్టీబ్రాహ్మణులు స్థాపించినదే. ప్రాచీన ఋషుల కాలములో ఈ దుష్ట సంప్రదాయము లేదు. కుమ్మరియగు భూరిశ్రవుడు సంస్కృతములో నున్న వేదములలో మహాపండితుడై నైమిశారణ్యమున యజ్ఞములో బ్రహ్మగా ఋషులచే ఎన్నుకొనబడుట ఎట్లు జరిగినది? వేదకోవిదులగు గార్గి, మైత్రేయి, సులభాయోగిని, మొదలగు స్త్రీల సంగతి ఏమందువు? కావున అందరికి అధికారముగల గానస్తోత్ర రూపమైన గాయత్రివేరు, గాయత్రీఛందస్సులో చెప్పబడిన మన్త్రార్థమైన గాయత్రి జపము వేరు. ఆనాడు జ్ఞానప్రచార బాధ్యతకు ఎట్టి ధనాకర్షణ లేకున్నను బ్రాహ్మణ కులము ముందుకువచ్చినది. జ్ఞానప్రచారముచేత దైవవిశ్వాసము దృఢముగా జనులలో స్థాపించబడుటవలన పాపభీతితో ప్రజలు సహజముగా ధర్మమార్గమున నడచుటవలన ప్రజాపాలన ఏంతో తేలికగా నడచినది. కావున ఈ బాధ్యత సంఘములో శాంతికి మూలాధారమని తెలిసి దీనికి ఎంతో విలువను అందరును ఇచ్చిరి. ఈ బాధ్యతానిర్వహణలో ఏదో నిధి దాగియున్నది, అది బ్రాహ్మణులకే దక్కినది అని ఇతరులకు కలిగిన అపార్థమునకు కారణము సంస్కృత భాషలో నున్న వేదశాస్త్రముల జ్ఞానము అందరికి లేకపోవుటయే.

"ఈ బాధ్యతను బ్రాహ్మణులకే ఏలఇచ్చిరి? ఆ కులములోనే ఈ బాధ్యత తరతరాలుగా ఏల వచ్చుచున్నది? ఆసక్తిగలవారందరికి సమానావకాశము ఏల

రాలేదు?" అని నీవు పిచ్చి ప్రశ్నలను వేయవలదు. ఏలననగా - ఏ బాధ్యతయు ఎవరును ఎవరికిని ఈనాడు వలె ఆనాడును ఇవ్వలేదు. ఆసక్తిగల కొందరు మాత్రమే ముందుకు వచ్చి, బాధ్యతానిర్వహణము ననుసరించి బ్రాహ్మణులని పిలువబడిరి. ఒక వృత్తిలో మెలకువలను తల్లితండ్రులు తమపిల్లలకు శ్రద్ధతో నేర్పుట సహజముకావున ఆ బాధ్యత తరతరములుగా ఆ కులములోనే కొనసాగినది. ఈ విధినిర్వహణలో ఎట్టి ధనలాభము లేనందున కొందరుమాత్రమే ముందుకు వచ్చినందున ఈనాటికిని బ్రాహ్మణుల సంఖ్య స్వల్పముగానే ఉన్నది. ఈ వృత్తిలో బిచ్చమెత్తుకొనుట లేక ఉంఛవృత్తి (పొలములో రాలిన గింజలను ఏరుకొనుట) మాత్రమే అనుమతించబడినందున ఎవరును ముందుకురాలేదు. దీనికి కారణము ఈ వృత్తిలో ధనమువలన అహంకారము రాకూడదు. ఇతర బాధ్యతలలో ఆర్థిక లాభము, ఐహిక భోగములు ఎక్కువగా ఉన్నందున ఎక్కువమంది ముందుకువచ్చినందున నేటికిని ఇతర కులములు అధిక సంఖ్యలోనున్నారు. పూర్వజన్మ సంస్కార కారణముగా ఎవరైనను ఇట్టి దరిద్రపరిస్థితిలోను ఈ వృత్తిపై ఆసక్తి కలిగి భూరిశ్రవునివలె ముందుకువచ్చినచో నాటి బ్రాహ్మణులు ప్రోత్సహించి గౌరవించిరికదా. "అవతార పురుషుడగు బలరాముడు సైతము తానువచ్చినపుడు ఋషులులేచి నిలబడినను, భూరిశ్రవుడు లేచి నిలబడలేదని కోపముతో భూరిశ్రవుని హలాయుధముతో సంహరించినాడు కదా. ఇది అగ్రవర్ణముల అహంకారము" అని నీవు అక్షేపించరాదు. ఏలననగా - ఋషులు వివరించిన తరువాత బలరాముడు తప్పుచేసినానని గ్రహించి భూరిశ్రవుని మరల బ్రతికించినాడు. ఈ పొరపాటును ఎవరును బలరామునితో సహా సమర్థించలేదు కదా. నీవు పిండిని మరల పిసుకుటయేల? బలరాముడు యాదవుడు. అగ్రవర్ణము కాదని తెలియవలయును. అవతార పురుషుడు కులములకు అతీతుడు. తొందరపడరాదనియు, పొరపాటుగా శిక్షించినపుడు సవరించుకొనుటకు శక్తిలేనపుడు ఆ శిక్షను ప్రయోగించరాదనియు జనులకు బోధించుటకు ఆయన ఆ విధముగా నటించినాడు.

## వృత్తి మెలకువలు - మార్గములు :

ఏ వృత్తిలోనైనను నైపుణ్యము, ఆసక్తి రెండువిధములుగా రావచ్చును. 1. పూర్వజన్మల బలీయమైన సంస్కార వాసనల మూలముగాను, 2. ఈ జన్మలో శ్రద్ధతో

తమ తల్లిదండ్రులు, కులపెద్దలు ఇచ్చిన తీవ్రశిక్షణ మూలముగాను ఏర్పడవచ్చును. “ఈ రెండు కారణములుకాక మూడవ కారణముగా ‘జీన్స్’ సిద్ధాంతము ప్రకారముగా సంస్కారము రావచ్చు” నని చెప్పరాదు. ఏలననగా జీన్స్ కేవలము కొన్ని శారీరక భౌతిక లక్షణములకే పరిమితమని నిరూపించబడినది. కావున వీటికి సంస్కారములతో సంబంధములేదు. భూరిశ్రవునిలో మొదటికారణము ఉన్నది. రెండవ కారణముగా కులవృత్తిలోను తీవ్రశిక్షణచేత ఆ వృత్తిని తరతరములుగా సాగించినప్పుడు, నీవు దీనిని అపార్థము చేసుకొని అసలు మూలవ్యవస్థయే ఇట్టి నియమములనేర్పాటు చేసినదని వ్యవస్థాపకులను నిందించరాదు. దీనికి చిన్న ఉదాహరణ : ప్రభుత్వము ఉపాధ్యాయ పదవులను భర్తీచేయుటకు ఒక పరీక్షను నిర్వహించినది. దానిలో అందరు ఉపాధ్యాయుల పిల్లలే ఉత్తీర్ణులైనారు. దీనికి రెండు కారణములన్నువి. 1. ఉపాధ్యాయ పదవిలో ఎక్కువ ఆదాయములేనందున ఎక్కువ మంది హాజరుకాలేదు. 2. ఉపాధ్యాయులు తమ పిల్లలకు తీవ్రశిక్షణను ఇచ్చినందున వారు ఆ వృత్తిపై ఆసక్తితో ఆ పరీక్షకు హాజరైనారు. ఈ అంశములను గమనించి విచారించక, ప్రభుత్వమే ఉపాధ్యాయుల పిల్లలకే ఈ పరీక్షను పెట్టినది అని అపార్థముతో నిందించుట అన్యాయముకదా. సత్యమును తెలుసుకొనుటకు ఓర్పు మరియు విశ్లేషణ ఎంతో అవసరము.

## నిజమైన భూరిశ్రవుడు నేడును అభినందనీయుడే :

“ఈనాడు ఇతరకులములనుండి కూడా బ్రాహ్మణవృత్తిని స్వీకరించు పురోహితులను భూరిశ్రవునివలె ఏల ప్రోత్సహించుటలేదు?” అని వాదించకుము. ఈనాటి వృత్తికిని ఆనాటి వృత్తికిని ఏమాత్రము పోలికలేదు. ఆనాడు ఏమాత్రము ధనాశలేని వేదజ్ఞానప్రచారము. ఈనాడు జ్ఞానములేక బట్టీపట్టి వేదపఠనము ద్వారా ముందుగా నిర్ణయించిన ధనమును సంపాదించుట. ఇట్లు ఈ వృత్తియొక్క అసలు తాత్పర్యమే పూర్తిగా భ్రష్టమైన ఈ కాలములో ఈ వృత్తిని ప్రోత్సహించుట లేక నిరాదరము చూపుట – ఈ రెండును సముద్రములో పోసిన పంచదార లేక ఇసుకవలె వ్యర్థములేకదా. ఆనాడు వేదజ్ఞానప్రచారమను పురోహిత వృత్తికి ధనము మనస్సులోకూడా యాచింపబడలేదు. నీకైనీవు గురుదక్షిణను యథాశక్తి (నీకు ఉన్నంతలో) మరియు యథాభక్తి (పురోహితునిపై నీకుకల శ్రద్ధననుసరించి)

దక్షిణను ఈయవచ్చును. నీకు ఉన్నను పురోహితునిపై శ్రద్ధ కలగనిచో ఈయపనిలేదు. నీకు పురోహితునిపై శ్రద్ధ కలిగినను నీకు లేనిచో ఈయపనిలేదు. ఇచట భక్తి శబ్దము పరోహితునిపై నీకుగల శ్రద్ధయేతప్ప దైవభక్తి కాదు. దీనిని దైవభక్తిగా సమన్వయించి నీనుండి ఎక్కువ రాబట్టు ఈగురువులను ఏమందుము? అసలు ఈ వృత్తిలో ముందుగానే విక్రయవ్యాపారములోవలె పనికి మూల్యము నిర్ణయింపబడుతున్నది. కావున ఈ వృత్తి జీవన భృతిగా మారినందున దీనిలో ఇతరులు ప్రవేశించుటకు ఆకర్షణము ఏర్పడినది. కావున ఇతర కులముల నుండి ఉద్యోగములు దొరకని ఈ కాలములో ఈ వృత్తిలోనికి ప్రవేశించుట మూలకారణమైనది. మరికొందరు బ్రాహ్మణులపై మొదటినుండియు ప్రజలుచూపించు గౌరవమును సహించలేక ద్వేషముతో కసిని తీర్చుకొనుటకు ఈ వృత్తిలోనికి దూకుచున్నారు. ఇట్లు దూకుచున్నవారిని మరియు ఈ వృత్తిని ధనార్జనముగా మార్చిన బట్టీ బ్రాహ్మణులను కూడా కలిపి నిందించవలయును. ఆనాడు ధనార్జన దృష్టి ఏమాత్రములేక కేవలము జ్ఞానప్రచారమను దైవకార్యమును నిర్వహించుచు పాపమును తగ్గించి ప్రజలను సహజముగనే ధర్మమార్గమున ప్రవర్తింపచేసిన ఋషులు ఎక్కడ? ఈనాటి ఈ బట్టీబ్రాహ్మణులు ఎక్కడ? ఆనాడు ధనార్జన లేకున్నను పూర్వజన్మ సంస్కారముచేత ప్రేరితుడై ఈ వైదిక వృత్తిలోనికి వచ్చిన భూరిశ్రవుడు ఎక్కడ? ధనార్జనకై మరియు బ్రాహ్మణద్వేషముతో ఈ వృత్తిలోకి వచ్చిన ఇతరకుల పురోహితులు ఎక్కడ? నిజముగ భూరిశ్రవునివలె ధనార్జన దృష్టిలేక పూర్వజన్మ సంస్కార ప్రేరితుడై జ్ఞానప్రచారములో ఆసక్తితో ఏ కులమునుండియైనను ఈ వృత్తిలోనికి వచ్చినచో నేడునూ తప్పక గౌరవనీయుడే.

**పూర్వపక్షి :** జన్మనాజాయతే శూద్ర: కర్మణా జాయతే ద్విజ: అన్న శాస్త్రశ్లోకము ప్రకారముగా బ్రాహ్మణుడు ఉపనయనము చేత ద్విజుడు అయిననూ, శూద్రుడు మాత్రము ఉపనయనము లేకపోవుటచే శూద్రునిగానే మిగిలిపోవుట అన్యాయముకాదా? మరియు శూద్ర మ్లేచ్ఛులకు వేదమును వినకుండా కరిగించిన సీసమును చెవిలో పోయమనుట ఎంతో దారుణముకదా.

**సిద్ధాన్తి :** అర్థమును ఏ మాత్రమును తెలియని బట్టీబ్రాహ్మణులు ఈ శ్లోకమునకు ఇట్టి దుష్టసమన్వయము చేయుట, వారివలె అర్థముతెలియని నీవును దానిని నమ్మి నిందించుట – ఈ రెండును హిందూమతమునకు పట్టిన దురదృష్టములు. ఈ శ్లోకములో సర్వ: (అందరు) అనుపదమును రెండవ చరణములో అధ్యాహారముగా తీసుకువచ్చినావు. అదేపదము మొదటిచరణములో కూడా రావలయును. అనగా ఈ శ్లోకార్థము – ఎవరైనను ఉపనయన కర్మచేత ద్విజుడు కావచ్చును. మరియు ఎవరైననూ జన్మచేత శూద్రుడే. అనగా ఆసక్తిగలవారు వారిశ్రద్ధను అనుసరించి ద్విజునిగా మారి ధనాశలేకుండా జ్ఞానప్రచారమును చేయవచ్చును. అయితే ప్రతిమానవుడును జన్మచేత శూద్రుడు ఎట్లుఅగును? బ్రాహ్మణవంశమున పుట్టిన ప్రతిశిశువు బ్రాహ్మణుడేకదా. కావున ఇచ్చట శూద్రశబ్దము రూఢిపరముగా ప్రయోగించబడలేదు. అనగా ఒక ప్రత్యేక కులమును శూద్రశబ్దముచే అర్థవిచారము లేకుండా పిలచుట రూఢిఅగును. కావున శూద్రులు అని పిలువబడు కులము రూఢి మాత్రమేతప్ప యోగరూఢికాదు. యోగరూఢిలో శూద్రశబ్దము అర్థపరముగా ఎవరికైనను అన్వయించి అట్లు పిలువవచ్చును. 'శోచత ఇతి శూద్రః' అను వ్యుత్పత్తి ప్రకారముగా ఎల్లప్పుడు ఐహిక జీవనమునుగురించియే చింతించువాడు శూద్రుడు. ఇట్టి చింతాపరుడు ఏ కులమువాడైనను శూద్రుడే. అట్లే 'సర్వాన్ బ్రహ్మనయతి ఇతి బ్రాహ్మణః' అను వ్యుత్పత్తి ప్రకారము అందరిని దైవభక్తులుగా మార్చగలవాడు ఏ కులమువాడైనను బ్రాహ్మణుడే. ఇదే గీతాశ్లోక సిద్ధాంతము. కృష్ణుడు గీతాజ్ఞాన బోధద్వారా యోగరూఢి పరముగా బ్రాహ్మణుడే. రూఢి పరముగా యాదవుడగు శూద్రుడే అనవచ్చును. కావున కులము యొగ రూఢి ద్వారా ఏర్పడుటయే గీతామతము. అయితే జన్మచేత వ్యవహరించబడుచున్న కులములను కూడా ఆ శబ్దములతోనే పిలచుచున్నారు. ఇట్లు పిలచుట కేవలరూఢి. కావున నీవు ఈ కులశబ్దములను ఉపయోగించునపుడు అవి రూఢిగానా? లేక యోగరూఢిపరముగానా? అను విషయమును నిర్ణయించుకొనవలెను. ఇచ్చట శ్లోకములో శూద్రశబ్దము యోగరూఢిపరముగా సంసారచింత కలవాడు ఎవడైననూ శూద్రుడే అని ప్రయోగించబడినది. కావున మానవజన్మనెత్తిన ఎవడైననూ జీవనభృతి చింతాపరుడే కావున ప్రతిమానవుడును శూద్రుడే. అట్లే ప్రతిమానవుడును ధనదృష్టిలేక జ్ఞానప్రచార

కర్మకు సంసిద్ధుడైనచో బ్రాహ్మణుడే. ఈ యోగరూఢశబ్దములతో రూఢశబ్దములను కలిపి ప్రయోగించినచో గందరగోళము ఏర్పడును. ఈ శ్లోకములో బ్రాహ్మణ శబ్దములేదు. కేవలము ద్విజశబ్దమే ఉన్నది. క్షత్రియ వైశ్యులుకూడా ద్విజులేకదా. ఉపనయనము లేనందున శూద్రులు ద్విజులు కానిచో బ్రాహ్మణ స్త్రీలు కూడా ద్విజులుకారుకదా. వారుకూడా శూద్రులే అగుదురు. అపుడు బ్రాహ్మణ కులములో నిత్యము వర్ణాంతర వివాహములు జరుగుచున్నట్లేకదా. కావున ఇచట ఉపనయనము అను శబ్దము కూడా రూఢమా? లేక యోగరూఢమా? అని చూడవలెను. సద్గురువును మాతృభాషలో గానముతో స్తుతించుచు సేవించు ప్రతి కర్మయు ఉపనయనమే అనుట యోగరూఢము. సంస్కృతములో అర్థము తెలియక వేదపఠనము చేయు ఒకానొక సంస్కార కర్మను ఉపనయనము అనుట రూఢము. శ్లోకములో ఉపనయనమునకు బదులు కర్మ శబ్దము ప్రయోగించబడినది. కావున యోగరూఢమైన ప్రతి ఉపాసన కర్మయు ఉపనయనమే. అట్లే గాయత్రీ శబ్దము రూఢి పరముగా ఆ పేరుతోనున్న ఛందస్సులో కల ఒకానొక వేదమన్త్రము. యోగరూఢి పరముగా గాయత్రి అనగా దైవమును నీ మాతృభాషలో గానముతో స్తుతించుట. ఈ విధముగా శ్లోకమంతయును యోగరూఢముగా సమన్వయించినచో దీని సారాంశము ఏమనగా - ఎవడైననూ ఐహికజీవన చింతకలవాడే కావున శూద్రుడే. అట్టి ప్రతి శూద్రమానవుడును జ్ఞానప్రచారమను వృత్తిని స్వీకరించినచో ఉపనయనకర్మ పొందినట్లే. కావున ద్విజుడగుచున్నాడు. ద్విజుడు అనగా రెండవ జన్మనెత్తుట. అనగా రెండు జీవితములు కలవాడని అర్థము. 1. జీవనభృతిని సంపాదించు ఐహిక జీవితము. 2. ధనాశలేని జ్ఞానప్రచార నిర్వహణము అను ఆధ్యాత్మిక జీవితము. ఇతర కులముల జీవనభృతి వృత్తులు ధనమును బాగుగనే ఇచ్చుచున్నవి. కానీ బ్రాహ్మణులు మాత్రము భిక్షాటనమే జీవనభృతి వృత్తి కావున దరిద్రులగనే ఉన్నారు. అయితే వారు ఇతరకుల వృత్తులను స్వీకరించవచ్చునా? అన్నచో దానికి నిషేధమున్నది. అట్టి ఇతర కులవృత్తుల ద్వారా ధనము చాలావచ్చును కావున అహంకారమేర్పడును. అహంకారము ఈ వృత్తిలో నిషిద్ధము. కావుననే ఈ వృత్తి చాలవరకు బ్రాహ్మణులకే పరిమితమైనది. ఏలననగా ఈ వృత్తిని చేయుచు భిక్షాటనముతో జీవించుటకు ఎవరును ఇష్టపడరు. శూద్రులు సంసారచింతాపరులై (యోగరూఢి) జ్ఞానమునందు నిరాసక్తులై ఉండి జ్ఞానప్రచారమును

ప్రోత్సహించరు. వీరిలో కొందరు తీవ్రవాదులు నాస్తికులై జ్ఞాననిందను చేయుచున్నవారు మ్లేచ్ఛులు అనబడుదురు (నాస్తికోవేదనిన్దకః). ఇచట శూద్రశబ్దము వలె మ్లేచ్ఛశబ్దము కూడా యోగరూఢమే. రూఢిపరముగా మ్లేచ్ఛశబ్దము ముస్లీములు అనబడు కులమునందు ఉన్నది. వీరు అల్లా పేరుతో దైవమును నమ్మువారు మరియు ఖురాన్ పేరుగల జ్ఞానగ్రంథమును పఠించువారే. కావున యోగరూఢి పరముగా వీరు మ్లేచ్ఛులు కారు. కావున జ్ఞానదైవములను నిరాదరణచేయు శూద్రులు, నిందించు మ్లేచ్ఛులు జ్ఞానసత్సంగమునకు భంగము చేయకుండా వారి చెవులలో ధ్వని నిరోధకములగు సీసపు గోలీలను పెట్టి దూరముగా తీసుకొనిపోయి విడచుటయే దీని తాత్పర్యము. కరిగిన సీసము అను అపార్థమును సృష్టించినవారు హిందూమత ములో చీలికలను కోరుకున్నవారే. కరిగిన సీసమును త్రాగి భరించుట శంకరులకు సాధ్యమైనది కానీ జీవులకు సాధ్యమా?

## గుణకర్మానుసారమే కులవ్యవస్థ:

ఉపాధ్యాయులు లోకములో అందరికీ విద్యాబుద్ధులను అందించు బాధ్యతను అల్పవేతనములున్నను (ఇటీవల కాలము వరకు) నెరవేర్చుచున్నందున వారిని ఇతరులు గౌరవించిరి. ఇతరులు మాత్రము మిగిలిన వృత్తులవైపే పరుగెత్తెడివారు. అల్పవేతనమైనను ఆ వృత్తిపై నీకు మక్కువఉన్నచో నీవు నిరభ్యంతరముగా భూరిశ్రవుని వలె రావచ్చును. ఈనాడు ఆనాడుగా ఉన్నచో ఎవరునురారు. జ్ఞానప్రచార వృత్తిని ఆరంభములోనే ఎన్నుకొని దరిద్రమునునుభవించుచు వంశపారంపర్యముగా మెలకువలను పిల్లలకు నేర్పుచూ వచ్చిన ఋషులను అపార్థము చేసుకొని వారు ఇతరులకు అర్హతలేదని నిషేధించినారని దూషించుట అన్యాయము అవివేకము. ఈ వృత్తి పవిత్రతను సర్వనాశనము చేసిన బట్టీబ్రాహ్మణులను నిందించుటలో తప్పులేదు. వీరిని మేమే నిందించుచున్నాము. ఋషులు అట్టి పక్షపాత నిషేధములను చేసియున్నచో భూరిశ్రవుని గౌరవించుట, బ్రాహ్మణుడగు రావణుని నిందించుట, అబ్రాహ్మణులగు రామ, కృష్ణ విగ్రహముల పాదములను నేటికిని కడిగి తీర్థముగా స్వీకరించుట, పంచమ కులీనయగు శబరిని నేటికిని బ్రాహ్మణులు పూజించుట మొదలగు ఋషులు స్థాపించిన హిందూమత సత్సంప్రదాయములు ఎట్లు నిలచినవి?

"బ్రాహ్మణులు ఉపనయనమును వారికులమునకే పరిమితము చేసుకొనినారు"

అని వాదించకుము. ఈ ఉపనయన కర్మను క్షత్రియ వైశ్యులకు వారే వర్తింపచేసిరి కదా. "వారు దీనిని శూద్రపంచములకు నిషేధించుట అన్యాయముకదా" అని వాదించకుము. వారు తమకులములోని స్త్రీలకును నిషేధించినారుకదా. ఎవరైననూ తమ కులములకు తామే చేతులారా అన్యాయమును చేయుదురా? కావున ఈ సంప్రదాయ స్థాపకులగు సద్బ్రాహ్మణ ఋషులకు స్వకులాభిమానము పరకులద్వేషము అగు పక్షపాతము లేదు. నీవు ఈ కర్మ యొక్క అసలు అర్థము తెలియక ఇట్లు ఆక్షేపించుచున్నావు. లోకములో జ్ఞానప్రచారమును చేయుటలో ఆసక్తిగల కొందరికే ఆ జ్ఞానప్రచార విషయములను బోధించుటయే ఈ ఉపనయన కర్మతాత్పర్యము. దీనిద్వారా ప్రచారముచేయబడిన జ్ఞానమును గ్రహించుటలో గానీ ఆచరించుటలో గానీ ఎవరికిని నిషేధములేదు. అట్టి జ్ఞానము ఏమనగా - మనుష్యరూపుడగు దైవమే సద్గురువు. ఆయనను గానముతో స్తుతించి, వంట చేయుట (అగ్ని కార్యము) మొదలగు క్రియలతో సేవించి, బ్రహ్మజ్ఞానమును గ్రహించి తరించుటయే. దీనికి ఒక చక్కని ఉదాహరణము : ప్రతివారును సేవించవలసిన మలేరియా నిరోధక మందును గురించి దాని సేవన విధానముల గురించి ప్రచారము చేసి మందును అందజేయుటలో అరోగ్యశాఖ ఉద్యోగులకు శిక్షణ ఈయబడినది. ఆ మందు దాని విధానములు ఎవరికైననూ అందనిచో వారు ఫిర్యాదుచేయుట న్యాయమే. ఏలననగా ఈ ప్రచారలక్ష్యము అందరును మందును పొంది సేవించి ఆరోగ్యమును పొందుటయే. కానీ ఎట్టి ధనలాభము లేని ఆ ప్రచార శిక్షణ తమకు లభించలేదని, తాము ప్రచారములో పాల్గొనలేదనియు ఎవరైనా ఫిర్యాదు చేయుదురా? నీ ఉద్యోగబాధ్యతలను వదలుకొని దీనికై ముందుకురానేల? ప్రచారములో నీకు వచ్చులాభమేమున్నది. లాభమంతయును ఆ మందును పొంది సరిగా సేవించటలోనే కలదు. ప్రచారఫలము ముఖ్యముగానీ ప్రచారక్రియకాదు. ఆ ఫలమే మానవరూపములోనున్న భగవదవతారమును గానముతో స్తుతించి సేవించి ఆయననుండి జ్ఞానబోధను పొందుటయే. "శూద్రపంచములతో పాటు వారి కులస్త్రీలకును కులలింగ పక్షపాతముతో ఋషులు అన్యాయము చేసినారు" అని వాదించకుము. ఆసక్తి ఆధారముగా మనుధర్మశాస్త్రము స్త్రీలకు గృహకృత్యములలోను, శూద్రులకు సంఘసేవాకర్మలలోను విధులను ఏర్పాటుచేసినది. మరియు పిల్లలపై

ప్రత్యేక శ్రద్ధతో మెలకువలను నేర్పుట ద్వారా ఈ విధులుకూడా వంశపారంపర్యముగా కొనసాగినవి. ఇట్టి వీరు జ్ఞానప్రచారమునకు సమయములేని వారు. ఇక పంచమకులమన్నదే లేదు. వేదములో నాలుగుకులములే పేర్కొనబడినవి. ఈ నాలుగు కులములలో తీవ్ర పాపములను చేసినవారి మిగిలిన వారిచే మార్పుకొరకు బహిష్కరింపబడిరి. తీవ్ర నేరస్థులగు విద్యార్థులు పాఠశాలలనుండి మార్పుకొరకు బహిష్కరింపబడుట నేటికిని ఉన్నది కదా. ఈ బహిష్కృతులు కలిసి పంచమకులముగా ఏర్పడిరి. తిండికొరకు ప్రాణులను చంపితినుట పాపము. అందులోను సాయముచేసిన ప్రాణులను చంపితినుట తీవ్రపాపము. పాలు త్రాగి పాలనీయలేని ముసలి ఆవులను గేదెలను చంపితినుట మరియు వ్యవసాయములో సాయపడిన ఎద్దులను, దున్నలను ముసలితనములో చంపితినుట తీవ్ర పాపములు (ఉద్యోగవిరమణము చేసిన వృద్ధ ఉద్యోగులను ఇట్లు చంపని ప్రభుత్వము అభినందనీయము). అయితే ఈ శిక్ష కేవలము వారిలో మార్పుకొనివచ్చుటకే తప్ప ద్వేషముతో కాదు. కావున అస్పృశ్యత పాపము వల్లనే కానీ జన్మచేత కాదు. ఏ కులము యోగరూఢిద్వారా జన్మచేత సిద్ధించదు. ఆ కులములో జన్మించిననూ శబరివంటి మహాభక్తులు నేటికినీ పూజనీయులే. దిద్దుకొనుటచేత పాపము మరియు దాని శిక్షయు నశించును. ఏలననగా శిక్ష దిద్దుటకే తప్ప కసితీర్చుకొనుటకుకాదు. పాఠశాలనుండి బహిష్కృతుడైన విద్యార్థి దాని యాజమాన్యమును నిందించునేకాని తాను దిద్దుకొనుటకు యత్నించడు. మార్పు చెందిన విద్యార్థి మరల పాఠశాలలోనికి ప్రవేశించుటయేకాక పరీక్షలకుకూడా హాజరుఅగును. అట్లే పంచములలో మార్పు వచ్చిన తరువాత వారిని మరల సగౌరవముగా చేర్చుకొని వారిని జ్ఞానప్రచారమునకు కూడా పంపుటకు వీలగును. ఒక వ్యక్తిలేక కులము యొక్క గౌరవములో హెచ్చుతక్కువలు వారు చేయు పుణ్యపాప కర్మలను బట్టియే తప్ప వారు ఆ కులమున పుట్టినందుకు కాదు. అహింసయే పరమధర్మము (అహింసా పరమోధర్మః). కావున హింసయేపరమ పాపము. ఆహారము కొరకు ప్రాణిహింసను చేయుట పరమ పరమ పాపము. భగవంతుడు ప్రొటీన్లు మొదలగు పోషక పదార్థములను ధాన్యము మరియు కూరగాయలలోనే ఎక్కువగా సృష్టించినాడు. వైద్యశాస్త్రము కూడా శాకాహారము ద్వారా లభించిన ఈ సహజపోషకములే మంచివనియు,

శాకములనుండి గ్రహించబడి మరల పునర్నిర్మాణము చేయబడిన ప్రాణుల శరీరములనుండి లభించిన పోషకములు మంచివి కావనియే చెప్పుచున్నది. వ్యక్తిగానీ కులముగానీ పాపములేని ధర్మప్రవర్తన ద్వారానే గౌరవమును అశించవలయును. ఋషినింద, బహిష్కృత విద్యార్థి యాజమాన్యమును నిందించినట్లుండును.

## గాయత్రీ ధ్యానశ్లోకము - యజ్ఞోపవీతము :

గాయత్రీ ధ్యానశ్లోకమగు 'ముక్తావిద్రుమ......' అనునది లౌకికమైన శార్దూలవిక్రీడిత ఛందస్సులో ఉన్నది కావున ఇది ఋషిరచన కాదు. అయిననూ అర్థజ్ఞానులగు పండితులచే రచింపబడినదే తప్ప బట్టీబ్రాహ్మణులు చేసిన పనికాదు. కావున ఋషుల జ్ఞానమార్గములోనే ఉన్నది. ఋషులు - పండితులు - బట్టీబ్రాహ్మణులు అను మూడు కాలక్రమ దశలను గుర్తించవలెను. ఈ శ్లోకములో గాయత్రి పంచముఖములు పంచభూతములను సూచించుచున్నవి. త్రిగుణములను సూచించు మూడు చూపులు (త్రీక్షణైః) త్రిగుణాత్మక చైతన్యమును సూచించును. ఇట్లు ముఖములు, చూపులును జడద్రవ్య - జడశక్తి - చైతన్య సమాహారమైన సద్గురు భౌతికశరీరమును చెప్పును. పంచభూతములలో ఆకాశము మరియు అగ్ని జడశక్తి. మిగిలిన మూడు భూతములు ఘన, ద్రవ, వాయురూపములలోనున్న జడద్రవ్యము. చంద్రరేఖ గల రత్నకిరీటము (ఇందు నిబద్ధ....) మనో బుద్ధులను సూచించును. చంద్రుడు మనస్సును జ్ఞానరత్నములు బుద్ధిని సూచించును. జ్ఞానవాక్యములు (తత్త్వార్థ వర్ణాత్మికామ్) తత్త్వబోధను సూచించును. ఇంతవరకు భక్తియోగ సాధనమగు మనస్సు మరియు జ్ఞానయోగసాధనమగు బుద్ధియు భావరూపమైన సేవను చెప్పును. చివరకు ఫలప్రదాయకమగు కర్మయోగసాధనమైన క్రియారూపసేవను పదిచేతులను పది ఇంద్రియములు గల శరీరము సూచించును. ఈ కర్మయోగమే వంటచేయుట (అగ్నికార్యము) మొదలగు సేవలు.

యజ్ఞోపవీతములోని మూడు పోగులు త్రిగుణాత్మక చైతన్యము అనగా చేతన నరశరీరమును సూచించును. దైవప్రార్థనలో చేతితో యజ్ఞోపవీతమును పట్టుకొనుటలో అర్థము - అనూహ్య పరబ్రహ్మమును నీవు చిక్కించుకొనలేవు. ఆ

పరబ్రహ్మము నరశరీర ఉపాధిని ప్రవేశించి తాదాత్మ్యము చెందును కావున అట్టి ఉపాధిని పట్టుకొని అర్చించుటచే అనూహ్య పరబ్రహ్మమును దాని ద్వారా చిక్కించుకొన్నవాడవు అగుదువు అనియే. ఈనాటి బట్టీబ్రాహ్మణులు ఈ అర్థమును సంస్కృతభాషా శాస్త్రజ్ఞానము లేకపోవుటచే గ్రహించలేక, చేతితో యజ్ఞోపవీతమును పట్టుకొనుట వీపు జిలను దానితో గోకుటకు ఉపయోగించుచున్నారు!

## అగ్నికార్యము :

జ్ఞానయోగముద్వారా సద్గురుదేవుని గుర్తించి, భక్తియోగము ద్వారా గానముతో స్తుతించి, కర్మయోగము ద్వారా ఆయనను సేవించుటయే సారాంశము. జ్ఞానభక్తి యోగములు భావరూపములు. కర్మయోగమగు సేవ క్రియారూపము. భావము క్రియను, క్రియ ఫలమును పుట్టించును. కావున భావక్రియలు రెండూ ముఖ్యములే. అగ్నికార్యములో వంటను చేయుటకు ఆకాలములో రెండు కట్టెలనుపయోగించి అగ్నిని పుట్టించుట చాల కష్టమైన క్రియ. కావున గురువువద్దకు పోవునపుడు కట్టెలను చేతపట్టుకొని పోవలయునని వేదముచెప్పుచున్నది (సగురు మేవాభి గచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్). యజ్ఞము యొక్క అంతరార్థము ఏమనగా - కట్టెలతో లౌకికాగ్నిని ఏర్పరచి, యజ్ఞసాధనమగు దానితో వంటచేసి, ఆ వంటద్వారా ఆకలిగొన్నవారి కడుపులలో మండు వైశ్వానరాగ్ని అను యజ్ఞఉపాస్యమైన దేవతాగ్నిని శాంతింపచేయుటయే. ఇట్లు ముందు సద్గురువును శాంతింపచేసి సేవించుటయే యజ్ఞము. యజ్ఞ శబ్దము యజ ధాతువునుండి ఏర్పడినది. యజ అనగా పూజించుట లేక సేవించుట. అగ్ని శబ్దము అగ్రి శబ్దమునుండి పుట్టినది. చేసినపాకములను మొదట (అగ్రి) వడ్డించి అర్చించవలసిన సద్గురువే అగ్ని. జ్ఞానాగ్నితో (జ్ఞానాగ్నిః.. - గీత) ప్రకాశించు సద్గురువే అగ్ని అని వేదవాక్యము (ఆగ్నేయోవై బ్రాహ్మణః). ఆదివేదమగు ఋగ్వేదములోని ఆది మన్త్రము అగ్ని అనగా - పురోహితుడు, యజ్ఞములో మొదట అర్చించవలసిన దేవుడు (యజ్ఞస్యదేవమ్), యజ్ఞకారకుడు అగు ఋత్విక్కు (ఋత్విజమ్) హవనము చేసి వైశ్వానరాగ్నిని శాంతింపచేయువాడు (హోతారం) మరియు జ్ఞానరత్నములను ధరించినవాడు (రత్నధాతమమ్) అని 'అగ్నిమీళే' అను మన్త్రము వర్ణించుచున్నది. యజుర్వేదము కూడా పాకయజ్ఞ సాధనమగు లౌకికాగ్నిని మండించుటకు కావలసిన సమిధను స్తుతించుచు ఆరంభమగుచున్నది (ఇషే....).

ఘృతమును అగ్నికి మొదట ఆహుతిచేయవలయును అనగా ఘృతముతోకూడిన అన్నమును మొదట సద్గురువుకు సమర్పించవలయును అనియే. ఘృతమనగా కేవలము నేయికాదు, నేతితోకూడిన అన్నముఅని శాస్త్రములో చెప్పబడిన లక్షణావృత్తిద్వారా గ్రహించవలెను. సత్యార్థగ్రహణములో సంస్కృత భాషాప్రావీణ్యము మరియు శాస్త్రజ్ఞాన పాండిత్యము చాలముఖ్యములు.

## మాతృభాషలోనే దైవ స్తోత్రగానము :

ప్రాచీనకాలములో సంస్కృతము భారతదేశములో మాతృభాషగా ఉన్నప్పుడు కూడా ప్రపంచములో ఇతర దేశములు వాటివాటి మాతృభాషలతోనున్నవి. కావున ఏ భాషలోనైననూ దేవుని స్తోత్రముతో గానము చేయవచ్చును. దేవుడు అన్నిభాషలను తెలిసిన సర్వజ్ఞుడు. మరియు అన్ని దేశములను సృష్టించినవాడు. కావున ఒకదేశములోని భాషపై పక్షపాతములేని విశ్వపిత. కేవల సంస్కృత భాషాప్రియుడైనచో అన్నిదేశములలో ఆదినుండియు సంస్కృత భాషనే ఏర్పాటుచేసియుండెడివాడు. ఈనాడు భారతదేశములో అనేక భాషలుగల అనేక రాష్ట్రములు ఏర్పడి ఇది చిన్న ప్రపంచముగా ఉన్నది. కావున ఆనాటి విధానమే ఈనాటికినీ వర్తించునుగావున భారతదేశములో ఎవరైననూ వారి మాతృభాషలో దేవుని గానముతో స్తుతించుటయే ఉపనయన గాయత్రీభావము. ఆనాడు సంస్కృతము మాతృభాషగా అందరికి తెలియును కావున మన్త్రములు వాటి విధానములు అందరికిని ఆనాడు తెలిసియే ఉన్నవి. ఈనాడు వినువారికే కాదు పఠించువానికి కూడా అర్థము తెలియక సర్వమును వ్యర్థము చేసినారు.

## గుడ్డిగా వేదమును బట్టీపట్టుట - అపార్థములు :

ఇంతవరకు శ్రీదత్తాత్రేయ ప్రభువు ఋషులను, పండితులను సమర్థించి, ఇక వేదపండితులమని చెప్పుకొనుచు వేదార్థమును ఏమియు తెలియని బట్టీబ్రాహ్మణులను తిట్టుచున్నారు. తండ్రి గుణవంతుడైన పుత్రుని ప్రశంసించి, దోషియగు పుత్రుని మందలించుట వాని మార్పుకొరకేకాని ద్వేషముతో కాదు. ఉపనయన విషయములో కూడ అర్థము ఏమియు తెలియక వీరు అపార్థములను సృష్టించినారు. మలేరియా నిరోధక మందు ప్రచారమును గురించిన శిక్షణ మొత్తము ఇంగ్లీష్‌లోనే ఉన్నది. ఆ శిక్షణ పొందు ఒక ఉద్యోగికి ఇంగ్లీష్ ఏ మాత్రమురాదు. ఆ ఉద్యోగి, ఆ శిక్షణయే

వ్యాధినిరోధక మందు అనియు, ఆ మందును తమకు మాత్రమే లభించినదిఅనియు ప్రచారము చేసినాడు. అప్పుడు ఇంగ్లీష్ తెలియని మిగిలిన వారును దానిని నిజమేఅని భావించి ఆవేశముతో దూషించుదురు. అట్లే ఈ బట్టీబ్రాహ్మణులు ఉపనయన కర్మ సారాంశమును ఏమాత్రము తెలియక, ఉపనయనము అనగా వారుచేయు ఆ సంస్కారమే అనియు, గాయత్రి అనగా అర్థముతెలియక బట్టీపట్టి తాము జపించు వేదమన్త్రమే ననియు, అగ్నికార్యము అనగా కట్టెలతో నిప్పును రాజేయుట, హెూమము అనగా దానిలో నేతినిపోసి దగ్ధము చేయుట, యజ్ఞము అనగా ఇట్టి అగ్నికార్య హెూమములు, ఉపస్థానము అనగా సూర్యునిముందు నిలబడి దోసిలితో నీటిని పారబోయుటఅనియు, సవిత అనగా ఆకాశములోని సూర్యుడేననియు, అగ్ని అనగా కట్టెలతో వెలిగించిన లౌకికాగ్ని అనియు భావించినారు. వీరు యోగరూఢి శబ్దములను ప్రత్యేకముగా గుర్తించక, రూఢి శబ్దములనే యోగరూఢి శబ్దములుగా భ్రమపడినారు. సంస్కృత భాషాజ్ఞానము మరియు శాస్త్రపాండిత్యము లేనందున వీటియొక్క అసలు అర్థములు తెలుసుకొనలేక భ్రష్టులై భ్రష్టాచారమును ప్రచారము చేసిరి. వీటి అసలు అర్థములు : ఉపనయనము అనగా ఆరాధనముద్వారా భగవంతునికి దగ్గరఅగుట, గాయత్రి అనగా మాతృభాషలో దైవస్తుతిని గానముచేయుట, అగ్నికార్యము అనగా కట్టెలతో లౌకికాగ్నిని వెలిగించి దానితో వంటచేయుట, యజ్ఞము అనగా ఆ వంటను ముందుగా సద్గురువుకువడ్డించి ఆయన కడుపులోనున్న ఆకలిమంటయగు వైశ్వానరాగ్నిని శాంతింపచేయుట, ఘృతము అనగా నేతితో చేర్చిన అన్నము, హెూమము అనగా దీనిని సద్గురువు కడుపులోని వైశ్వానరాగ్నిలో హుతముచేయుట, సవితయనగా సృష్టికర్తయగు పరమాత్మ, అగ్నిఅనగా మొదట పూజించవలసిన సద్గురువే అనియు, ఉపస్థానము అనగా సద్గురువుకు మంచినీటిని త్రాగుటకు అందించుట అని గుర్తించవలెను. జ్ఞానము లేకపోవుట అను అజ్ఞానము మాత్రమే ఉన్నచో మౌనముగానుందురు. అజ్ఞానముతో పాటు అహంకారముఉన్నచో విపరీతార్థమును సృష్టింతురు. సూర్యుని పరమాత్మకు ప్రతీకగా భావించి భావరూపమైన భక్తిని వృద్ధిచేసుకొనవచ్చును. దీనిలో ప్రాణిసేవలో వినియోగించు వస్తువుల నష్టములేదు.

ఈ బట్టీబ్రాహ్మణులు రూఢిపరముగా ఒకానొక సంస్కారమునకు పెట్టిన పేరుఅగు ఉపనయనమే భగవంతునివద్దకు చేర్చగల ఏకైక కర్మ అని ప్రచారముచేసి

దానికి తామే యోగ్యులమనియు, స్త్రీలు, శూద్రులు, పంచములు యోగ్యులు కారనియు అపార్థమును సృష్టించినారు. దీనితో హిందూమతములో కలహములు, చీలికలు వచ్చి అనైక్యత ఏర్పడినది. ఏమాత్రము అర్థము వీరికిని, ఇతరులకును తెలియకపోవుట వలన అజ్ఞానముతో పాటు ప్రచారముచేయబడిన విపరీతార్థమును నిజమని నమ్ముటచేత అన్యాయము జరిగినదని భ్రమ కలిగి గందరగోళము ఏర్పడి హిందూమతము ఛిన్నాభిన్నమైనది. శబ్దార్థమే తెలియని పరిస్థితి లో ఇక రూఢి అర్థము, యోగరూఢి అర్థము బోధపడునా? ఈ సృష్టించబడిన అజ్ఞానకారణముగా వచ్చిన విపరీతార్థము యజ్ఞములో ఎక్కువ నష్టమును కలుగజేసినది. అగ్ని అనగా యోగరూఢ పరముగా సద్గురువు అని తెలియక రూఢపరముగా లౌకికాగ్నిని భావించి, లక్షణాపరముగా ఘృతము అనగా ఘృతముతో కూడిన అన్నము అని తెలియక దానిని కేవలము నేతిగా భావించి, నేతిని లౌకికాగ్నిలో పోసి దగ్ధము చేయుటయే విపరీతార్థముగా ఆచారమును స్థాపించినారు. దీనివలన ఎంతో విలువగల ఆహారమైన ఘృతమును నాశనము చేయుట ఏర్పడినది. అగ్నిద్వారా దేవతలు ఆహారమును తీసికొందురు అన్న వేదవాక్యమును (అగ్నిముఖా వై దేవాః) అపార్థము చేసుకొని లౌకికాగ్నిలో నేతిని పోసి దేవతలకు ఆహారమును ఇచ్చుచున్నామని భావమును కల్పించిరి. అగ్నిఅనగా బ్రహ్మజ్ఞానియగు సద్గురువే అనియు, సర్వదేవతలు ఆయనలోనే నివసింతురనియు, ఆయనకు పెట్టిన ఘృతాన్నము (ఘృతము) సర్వదేవతలకు చెందుననియు, దానితో ప్రసన్నులై వర్షమును కురిపింతురనియు తెలియకపోవుటయే అజ్ఞానము. ఈ విషయము వేదములో (యావతీర్వై....) స్పష్టము. వీరి విపరీతార్థము వలన ఘృతమును నేరుగా లౌకికాగ్నిలో దగ్ధము చేయుటవలన వాతావరణ కాలుష్యమేర్పడి వర్షములు ఆగుచున్నవి. ఇంతేకాక వాతావరణ కాలుష్యమువలన మానవులకు అనేక రోగములు వచ్చుచున్నవి. ఇట్లు విపరీతార్థము వలన లోకమునకు అపకారము చేయు అసురులుగా భూసురులైన ఈ బట్టీబ్రాహ్మణులు ఏర్పడిరి. మానవులకు ఆహారముగా శాకధాన్యములను భగవంతుడు సృష్టించినాడే తప్ప మానవులకు ఇతర ప్రాణులను చంపి తినుట నిషేధము. అట్లు చంపి తిను మానవులు క్రూరమృగములకన్న భిన్నులు కారు. ఈ బట్టీబ్రాహ్మణులు చివరకు యజ్ఞములో ప్రాణులను వధించి మాంసాహారులైనారు. మరియు సోమలతారసము అను

మద్యపానముకూడా చేర్చినారు. ఇదికూడా వేదార్థము తెలియని అజ్ఞాన ఫలితమే. అచట చంపవలసినది పశువుకాదనియు, పశురూపమున ఉన్న మూర్ఖత్వమేననియు వేదవచనము (మన్యుః పశుః). భాగవతములో భగవదవతారమైన కపిలమహర్షి తల్లికి జ్ఞానమును బోధించు ప్రకరణములో లౌకికాగ్నిలో నేతిని పోసి దగ్ధము చేయువాడు మూఢుడని చెప్పినాడు. మరియు అదే గ్రంథములో లౌకికాగ్నిలో దగ్ధము చేయుటకు వండిన అన్నమును అట్టి హోమమునకు ముందే ఆకలితోనున్న తన మిత్రులకు పెట్టమని మునిపత్నులను కృష్ణభగవానుడు ఆదేశించినట్లుచెప్పబడినది. లౌకికాగ్ని వంటచేయుటకు ఉపకరించు యజ్ఞ సాధనమే కానీ యజ్ఞములో అర్చింప వలసిన ఉపాస్యము ఆకలితోనున్న సద్గురువు మరియు అతిథుల జఠరాగ్నియే. ఈ ఆకలిమంటయే తనస్వరూపమైన వైశ్వానరాగ్ని అని గీతలో భగవంతుడు వచించినాడు (అహం వైశ్వానరో...). తైలాభిషేకమనగా సద్గురువు జ్ఞానాగ్నిని బోధించినపుడు శిరస్సుచాల వేడిగానుండును.దానిని చల్లబరుచుటకు ఉష్ణవాహకమగు తైలమును దానిపై అర్పించవలెను. ఇదికూడ తెలియక బట్టీబ్రాహ్మణులు శిలలపై వ్యర్థముగా తైలమును కుమ్మరించుచున్నారు! ఇట్టివీరిని అజ్ఞానులగు దేవపశువులని వేదమే తిట్టినది (దేవానాం పశురహహ). పశువులుకూడా మనమాటల ధ్వనిని వినుటయే తప్ప అర్థమును తెలియవుకదా. అట్లే వీరును వేదపఠన ధ్వనిని వినుచున్నారే తప్ప వేదార్థమును తెలియరు. ఈనాడు ఇతరులు కూడా వీరివలె వేదార్థమును తెలియనివారే. ఇట్టివీరిని శాస్త్రముకూడా అల్పమైన కూలిని ఆశించి బంగారమును దాచిన మూటలను మోయుచున్న కూలీలుగా నిందించినది (స్వర్ణభార హరః). ఇప్పటికైనా వీరు తమ సంతానమునైననూ వేదములను బట్టీపట్టుటకై పంపించక సంస్కృత భాషా శాస్త్రజ్ఞానమునకై పంపించి వారికైననూ న్యాయము చేయవలెను. తమ తండ్రులు తమకు చేసిన అన్యాయమును తమ పిల్లలకు తిరిగి తాము చేయరాదు.

## సమత్వమే న్యాయము :

ఉపనయనము అనగా భగవంతుని సమీపించుట అని అందరికి తెలియును. దీనికి సర్వజీవులకును సమానమైన అధికారమున్నది. జగత్పిత అయిన పరమాత్మను చేరుటకు బిడ్డలందరును అర్హులే. భాషయు, అర్థజ్ఞానము లేని పశుపక్ష్యాదులకు అట్టి అర్హత లేకున్నది. శంకరులు బ్రహ్మసూత్ర భాష్యారంభములో కుల,లింగములకు

అతీతముగా ఆసక్తిగల ప్రతిజీవుడును బ్రహ్మజ్ఞానమునకు అర్హుడని వచించినారు. గీతకూడా భగవంతుడు సర్వజీవులకు తండ్రి అనియు (అహంబీజప్రదః....), అన్ని కులములు ఆయనను చేరుటకు అర్హులనియు చెప్పుచున్నది (స్త్రియో వైశ్యాః....). కావున యోగరూఢిపరముగా సత్యమైన ఉపనయనమును ఎవరికిని నిషేధించుటకు ఎవరికినీ అధికారము లేదు. దీనిని రూఢిపరముగా అర్థములేని ఒకానొక కర్మకు పేరుగా పెట్టుకొని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కుల పురుషులకే పరిమితము చేయుట అజ్ఞానము. రూఢిపరముగా ఈ కర్మను స్త్రీ, శూద్ర, పంచములకు నిషేధించుటయు వ్యర్థమే. ఏలననగా రూఢిపరమైన ఈ కర్మ సత్యముగా ఉపనయనమే కాదు. రూఢిపరమైన ఈ కర్మను యోగరూఢిపరమేనని అసత్యము చెప్పుచు కొందరికి నిషేధించుట అజ్ఞానమే. కొందరికే ఈ కర్మను ప్రవర్తింపచేయుటలో అనేక సంశయములు వచ్చును. క్షత్రియులు రాజ్యాధికారులు కావున వారిని మెప్పించుటకు, వైశ్యులు ధనవంతులు కావున వారినుండి లాభపడుటకు ఇట్లుచేసిరని అనుమానించ వచ్చును. ఈ అనుమానములే బలపడి కలహములకు దారితీసి అనైక్యతను బలపరిచినవి. సంప్రదాయమును స్థాపించినవారు కూడా బ్రాహ్మణ పురుషులే కావున పురుషబ్రాహ్మణులపై ఏర్పడిన ఈ ద్వేషము ఋషినిందకును దారితీసినది. బ్రాహ్మణ స్త్రీలు తమ తండ్రులు భర్తలపైగల గౌరవ భయములవలన మౌనముతో నుండిరి. కానీ మిగిలిన వారిలో కొందరు విప్లవకారులై హిందూమతమును త్యజించి పరమతములలోనికి ప్రవేశించిరి. అన్ని మతములు భగవంతునివద్దకు చేరు మార్గములే. ఏ మతములోను దోషమూలేదు, ఇతర మతములకనన్నా అధిక గుణమూ లేదు. నీ మతములో మూర్ఖుల దురాచారములను త్రోసిపుచ్చి, వాటిని మతముపై ఆరోపించక, నీ మతములోనే నిలబడమని గీతా వచనము (స్వధర్మే నిధనం.....).

## దయానందసరస్వతి - అత్యవసర చర్య :

అవతార పురుషుడైన స్వామి దయానంద సరస్వతి ఈ మతాంతరీకరణమును నిరోధించుటకై రూఢిపరముగా ఒకానొక సంస్కార కర్మయైన ఉపనయనమును అన్ని కులములకును వర్తింపచేసినారు. దీనివలన తాత్కాలిక నివారణ చర్యగా మతాంతరీకరణము ఆగినది. గుణ కర్మలద్వారానే కులమని వారు చేసిన నిర్ణయము గీతలో ఎప్పటినుండియో ఉన్నది. అయితే ఈ నివారణ చర్య, వ్యవస్థాస్థాపకులగు

ఋషులు చేసిన పొరపాటును సరిదిద్దుటగా ఏర్పడినందున, ఇంతకు ముందు జరిగినదంతయు ఋషులు చేసిన పొరపాటేనని సిద్ధించినది. ఇంతకుముందు జరిగిన పొరపాటును దిద్దుట సాధ్యముకాదు కావున దీనివలన కొందరికి పూడ్చలేని నష్టము జరిగినది అని సిద్ధించుట వలన ఋషులపై, మతముపై మాయని మచ్చ ఏర్పడినది. దీనికి ఋషియగు శ్రీదత్తాత్రేయ స్వామి ఇట్లు బదులు ఇచ్చుచున్నారు – ఎటూ నీవు నష్టనివారణచర్యలో ఇతరులకు చేసిన ఉపనయన కర్మ రూఢిపరమేగానీ యోగరూఢిపరము కాదుకదా! రూఢి అసత్యము, యోగరూఢి సత్యము. అసత్యమైనదానిని కొందరికే ఇచ్చినారు అను మచ్చను తొలగించుటకై ఆ అసత్యమును అందరికీ ఇచ్చుటలో ఏమి ఫలము కలదు? సత్యమైన యోగరూఢి పరమైన ఉపనయనమును ఋషులు ఎటూ ఇదివరకు అందరికీ ఇచ్చియే యున్నారు. కావున నీవు చేసిన నష్టనివారణ చర్య తాత్కాలికముగా ఆవేశమును శాంతింపచేయుటకే కాని, నిజముగా నెమ్మదిగా అలోచించినచో ఋషులు ఎప్పుడునూ ఎవరికినీ అన్యాయము కానీ పక్షపాతముకానీ చేయలేదు. ఈ సత్యమును తెలిసినచో నష్టనివారణ చర్యలో ఏమియును లేదనియు, ఋషులను నిందించపనిలేదనియు తేలిపోవుచున్నది. దీని వివరణము ఏమనగా – ఏవరైననూ మాతృభాషలో భగవంతుని గానముతో స్తుతించి ఆయనకు దగ్గరగా అగుటయే ఉపాసన ప్రకరణమగు సత్యమైన గాయత్రీ ఉపనయనము. ఈ సత్యమైన దానిని ఎటూ అందరికీ సమానముగా పంచబడినది. కావున ఋషులు ఎవరికిని ఎప్పుడును అన్యాయ పక్షపాతమును చేయలేదు. ప్రస్తుతము చేయబడు ఉపనయన సంస్కార కర్మ ఉపనయనమును గురించి ప్రచారము చేయబడవలసిన జ్ఞాన విషయములను గురించిన జ్ఞాన ప్రకరణమే తప్ప భగవంతుని వద్దకు చేర్చు ఉపాసన ప్రకరణము కాదు. ఈ జ్ఞాన ప్రకరణము వలన ఒకరికి ఒరిగినదియు మరొకరికి పోయినదియు ఏమీలేదు. ఇది కేవలము మలేరియా నివారక మందును గురించి కొందరికి మాత్రమే శిక్షణనిచ్చిన ట్రైనింగ్ ప్రోగ్రామ్ వంటి జ్ఞానప్రకరణము. అందరికీ అందించిన సేవన విధానములతో కూడిన మందువంటిది ఉపాసన ప్రకరణము. అర్థజ్ఞానమే లేని బట్టీబ్రాహ్మణులు ఈ వివరణజ్ఞానమును గురించి తెలియక జ్ఞానప్రకరణమునే ఉపాసన ప్రకరణముగా

ప్రచారము చేసి కొందరికి యోగ్యతలేదని అపార్థమును సృష్టించినను దానివలన వచ్చిన అవమానమును సహించి, గీతావాక్యము ప్రకారముగా తమ మతమైన హిందూ మతము లోనే నిలబడిన స్త్రీలు, శూద్రులు మరియు పంచములు అభినందనీయులు. అట్టి వీరికే ఈ సందేశమును అంకితమిచ్చుచున్నాను.

## లింగవివక్ష పూర్తిగా అర్థరహితము :

కులవివక్షను కొంతవరకైననూ అర్థము చేసుకొనవచ్చును కానీ లింగవివక్ష మరీ అర్థరహితమైనది. ఈ వివక్ష స్త్రీ పురుషుల బాహ్య శరీరములలో కల కొన్ని స్వల్పమైన మాంసవికారములపై ఆధారపడి ఏర్పడుచున్నది. కులవివక్ష కనీసము అంతర్గత గుణములపై ఆధారపడియున్నది. పురుషుడనగా పురము అనబడు శరీరమునందు చైతన్యస్వరూపముగా శయనించిన లేక వ్యాపించిన జీవాత్మయే తప్ప మగమనిషి అని కాదు. పురుషునకు బాహ్యశరీర లక్షణములతో సంబంధములేదు. కావున ప్రతి మానవ జీవియు పురుషుడే. ఈ చైతన్యమే సృష్టిలో శ్రేష్ఠభాగము కావున పరాప్రకృతి అనబడుచున్నది. మిగిలిన ప్రకృతి శరీరమును సూచించు అపరాప్రకృతి లేక ప్రకృతి అనబడుచున్నది. ఈ రెండు పరా మరియు అపరా ప్రకృతులు, పురుషుడు మరియు ప్రకృతి గా సృష్టిలోని భాగములే. ఈ సృష్టికి అతీతుడైన సృష్టికర్త పురుషోత్తముడు అనబడును. ఇది ఒకరకమైన వర్గీకరణము. మరియొక వర్గీకరణములో పురుషోత్తముడే పురుషుడు. జీవాత్మయు శరీరము కలిసి ప్రకృతి అనబడును. కావున ఇందులో పురుషుడు ప్రకృతి అని రెండు విభాగములే ఉండును. ఏ వర్గీకరణములోనూ శరీరలక్షణములోని భేదము యొక్క ప్రసక్తిలేదు. మగ లేక ఆడ శరీరములలోనున్న ప్రతిజీవాత్మయు పురుషుడే. గీతలో ఒక పురుషుడు మరియొకరిని ఎట్లు చంపును (కథంసపురుషః...) అన్నపుడు పురుషుడు అనగా చంపుచున్న మగవాడేకాదు ఆడదియు అని తెలియవలెను. ఇట్లు ఆత్మా, జీవః మొదలగు పుంలింగ శబ్దములన్నియును జీవాత్మనే చెప్పునుకానీ లింగ వివక్షను చేయవు. కొందరు మూర్ఖులు పురుషుడనగా మగవాడేననియు కావున వేదాంతశాస్త్రము మగవారికేననియు పలుకుదురు. గార్గి, మైత్రేయి, సులభ మొదలగు స్త్రీలు వేదాంత విదుషీమణులు. జ్ఞానాధిదేవతయగు సరస్వతియు స్త్రీయే. గాయత్రిని స్త్రీదేవతగా వర్ణించిరి కదా. మరి స్త్రీలకు గాయత్రినెట్లు

నిషేధింతువు? స్త్రీయగు దేవీపూజలో షోడశోపచారములలో యజ్ఞోపవీతమునెట్లు సమర్పించుచున్నావు. సీత సాయం సంధ్యావందనము చేయుటకు ఈ సరస్సువద్దకు వచ్చునని హనుమంతుడు చింతించుట సుందరకాండలో కలదు (సంధ్యార్థం వరవర్ణినీ). పూర్వయుగములో స్త్రీలకు ఉపనయనములు జరుగుచున్నట్లు స్మృతి (పురాకల్పేతు నారీణాం). మరి ఈ కలియుగములో స్త్రీలకు ఉపనయనము ఏలలేదు? దీనికి కారణము ఈ కలియుగములో నిత్యము పాకయజ్ఞమును స్త్రీలు చేయవలసి వచ్చినందున వారి యజ్ఞోపవీతమును వివాహములో భర్తలకు కన్యల తండ్రులు అందించుచున్నారు. దీనివలన భర్తచేయు పుణ్యకర్మల ఫలములో సగము భార్యకు వచ్చుచున్నది. ఇట్టి ఏర్పాటుకు కారణము కలియుగములో ప్రతిదినము స్త్రీలు పాకయజ్ఞమును చేయవలసి వచ్చినది. పూర్వయుగములో కందమూలఫలాదులు నిత్యాహారములు. ఎప్పుడో అతిథి వచ్చినప్పుడే వంటలను చేయు పాకయజ్ఞము జరిగెడిది. ఆ యజ్ఞములో భార్యాభర్తలిరువురును సమముగా పాల్గొనెడివారు. కావున ఎవరి అనుష్ఠానములు వారే చేసుకొనెడివారు. ఇట్టి ఏర్పాటు రోగి యొక్క సంధ్యావందనము బంధువుచేయు ఆచారమున కనపడుచున్నదికదా! వేదము కూడా పురుషుడనగా భగవంతుడేనని జీవాత్మలందరును స్త్రీలు అయన సతులేననియు చెప్పుచున్నది (స్త్రియఃస్సతీః....). ఈ సందర్భములో మీరా తులసీదాసుల సంభాషణము ఒకటి గమనీయము. మీర తులసీదాసు ఆశ్రమములో ఒకరోజు ఉ ండుటకు తులసీదాసును అర్థించినది. దానికి ఆయన తన ఆశ్రమమున స్త్రీలకు నిషేధమని పలికినారు. దానికి మీర ఆశ్చర్యముతో " మన జీవులలోకూడా పురుషులున్నారా? ఇప్పటివరకు కృష్ణుడొక్కడే పురుషుడని భావించుచుంటిని" అని పలికినది. ఈ రెండు వర్గీకరణములలో పరమాత్మను పురుషశబ్దముతో చెప్పుటకు కారణము, పరమాత్మ ఒక జీవాత్మలోనికి ప్రవేశించి తాదాత్మ్యము చెందుటవలన పరమాత్మను చూపించుటకు అవకాశము వచ్చినది. లేకున్నచో అనూహ్యుడగు పరమాత్మ ఊహలకు సైతము అందడు కావున 'ఇదిగో పరమాత్మ' యని చూపించుటకు సాధ్యము కాదు కదా.

బ్రాహ్మణుడు ఇంటిలో భార్య నుండి గృహకృత్యముల సేవాఫలమును పొందినట్లు, సంఘములో శూద్రులు చేయు సంఘసేవా ఫలములు కూడా

పొందుచున్నాడు. కావున అతడు చేయు అనుష్ఠాన ఫలములో కొంతభాగము శూద్రులకును చెందుచున్నది. సర్వజనులు సుఖముగా నుండవలెనని బ్రాహ్మణుని అనుష్ఠాన ఫలము లోకమునకు అర్పించబడుచున్నది. అనుష్ఠానమును చేయు క్షత్రియ వైశ్యులకు ఈ ఫలభాగము అవసరములేదు. కావున ఈ ఫలభాగము అనుష్ఠానము చేయని గృహములోని స్త్రీలకు, సంఘములోని శూద్రులకు అందుచున్నది.

"స్త్రీలు మాసిక ఋతుచక్రము వలన నాలుగు రోజులు అస్పృశ్యులు కావున వీరికి ఉపనయనము నిషిద్ధము" అని వాదించకుము. ఏలననగా - ఇంద్రుడు వృత్రాసురుని చంపిన పాపము నాలుగు భాగములుగా స్త్రీల ఋతువులోను, జలముయొక్క నురుగులోను, భూమియొక్క గంధములోను, పుష్పములయొక్క రేణువులలోను నిక్షిప్తమైనదని శాస్త్రప్రమాణము. మిగిలిన మూడు నిత్య పవిత్రములుగా చూచుచున్నాము. మట్టిని యజ్ఞవేదికా నిర్మాణమునకు, జలమును పుణ్యకర్మలలోను, పుష్పములను అర్చనలోను వాడబడుచునే యున్నవి. భూమిమట్టిలో గంధమున్ననూ, జలములో నురుగు ఉన్ననూ, పూలలో పుప్పొడి రేణువులున్ననూ వాటికి పుణ్యకార్యములలో నిషేధములేనప్పుడు స్త్రీలకు మాత్రము ఋతుదినములలో సైతము నిషేధమెట్లు వచ్చును? అయితే స్త్రీలకు అ నాలుగు దినములు గృహకృత్యములలో పాల్గొనకుండా వ్యవస్థ నిషేధించుటలో అంతరార్థము ఏమనగా - అ నాలుగు రోజులు రక్తస్రావము వలన స్త్రీని రోగిగా భావించి గృహకృత్యములలోనికి రానీయకుండా బలవంతముగా విశ్రాంతిని కల్పించుటయే. ఈ నిజము తెలిసినచో వారు విశ్రాంతిని లెక్కచేయక ఆ నాలుగురోజులలో కూడా గృహకృత్యములలో పాల్గొందురు కావున వారి విశ్రాంతి ప్రయోజనమును లక్ష్యముగానుంచి అస్పృశ్యత అను అసత్యము ద్వారా విశ్రాంతిని సాధించుచున్నారు. ఇట్టి ఏర్పాట్లు అర్థవాదము లనబడును. రోగియైన పురుషుడు రోగసమయములో అనుష్ఠానము చేయడు కదా! కానీ పురుషునికి దీనివలన ఉపనయన నిషేధములేనప్పుడు, స్త్రీకి మాత్రము ఎట్లు నిషేధము వచ్చును? భూమి, జలము, పూలు విషయములో అవి అచేతములు కావున రోగము విశ్రాంతి ప్రసక్తిలేదు. రక్తస్రావము కల గాయమున్నప్పుడు పురుషునకు కూడా విశ్రాంతి నిర్దేశింపబడుచున్నది కదా!

## అహింస పరమధర్మము గౌరవప్రదము :

గుణానుసారముగా, ఆసక్తిని ఆధారము చేసుకొని, బాధ్యతలను పంచి ఏర్పరిచిన కులవ్యవస్థలో ఎట్టి దోషములేదు. వీటి మూలముగా కులములలో హెచ్చుతక్కువలు లేవు. నాలుగు కులములను సృష్టించిన బ్రహ్మయొక్క ముఖము, బాహువులు, తొడలు, పాదములు సమాన అంగములే. దేనిని కొట్టిననూ మిగిలిన వాటికి కూడా బాధకలుగును. ముఖము జ్ఞానబోధకును, బాహువులు యుద్ధమునకు, పాదములకు ఆధారమై బలమునిచ్చు తొడలు సంఘసేవచేయువారికి అవసరమైన ఐశ్వర్యమునందించుటకు మరియు పాదములు సంఘసేవయను కర్మగమనమునకు ప్రతీకలు. వీరేక్రమముగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. ఇంతవరకును నాలుగు కులములకు సమానస్థానము మరియు సమానగౌరవము ఉన్నది. కానీ పరమధర్మమైన అహింసకు విరోధముగా ప్రాణి హింసనుచేసి మాంసాహారమును భుజించుట మహాపాపము మిక్కిలి అధర్మము. కేవలము ఈ విషయమును బోధించుటకు బుద్ధ, మహావీరులను రెండు అవతారములు వచ్చినవి. ఈ ధర్మాధర్మములను ఆధారముగా చేసుకొని గౌరవములో హెచ్చుతగ్గులు వచ్చినవి. నిజముగా మాంసాహారులగు క్షత్రియులకన్నా వైశ్యులు గౌరవనీయులు. కానీ క్షత్రియులు రాజ్యపాలకులు కావున పాలకునకు అత్యధిక గౌరవము అవసరమైనందున మూడవ స్థానములో ఉండవలసిన క్షత్రియులు రెండవ స్థానమునకు వచ్చిరి. క్షత్రియులు, యుద్ధములో బలము అవసరము కావున తమ మాంసాహారమును సమర్థించుకొనరాదు. ఏలననగా కేవలము శాకాహారియైన పరశురాముడు యుద్ధములో సర్వక్షత్రియ సంహారము చేసినాడు. శూద్రులు సంఘసేవలో ప్రభుత్వము యొక్క ముఖ్యయంత్రాగములు. గృహకృత్యములలో స్త్రీలు ఎంత గౌరవనీయులో సంఘసేవలో శూద్రులును అంత గౌరవనీయులే. కులవివక్షతో శూద్రులను, లింగ వివక్షతో స్రీలను తక్కువచేయరాదు. స్త్రీలను గౌరవించినచోట దేవతలు ప్రసన్నులగుదురని మనుధర్మశాస్త్రము. ఆహారములో ప్రాణిహింసా విషయమే గౌరవమును తగ్గించుచున్నది. భగవంతుడైన రాముడు మాంసాహారియని భ్రమించరాదు. భగవంతుడు ఒక కులమును ఉద్ధరించుటకు దానిలో అవతరించి వారికి సన్నిహితుడుగా అగుటకు వారి సంస్కృతిని పాటించవలసి వచ్చును. బురదగుంటలో కూరుకుపోయిన వారిని ఉద్ధరించుటకు బురదగుంటలో దూకినందున బురద అంటుకొనక తప్పదు.

"మీరు శూద్రులను బుజ్జగించి మోసగించుటకు ఇట్టి నయవంచకపు మాటలను పలుకుచున్నారు" అని పలుకవలదు. శూద్రులను మోసగించినచో, బ్రాహ్మణులు తమ కులస్త్రీలను కూడా మోసగించినట్లేకదా! ఉపనయన (రూఢి) నిషేధము, సేవాధర్మము స్త్రీ, శూద్రులకు సమానమేకదా! పైగా నిషేధింపబడిన ఉపనయనము అసత్యమైనదే (రూఢమే) కానీ సత్యము (యోగరూఢము) కాదుకదా! సత్యమైన ఉపనయనము అందరికిని మలేరియా నిరోధక మందువలె సమానముగా అందుచున్నది. ఆ మందు ప్రచారము వంటి అసత్యమైన ఉపనయనము (అనగా సత్యముగా మందు ప్రచారకులకు మాత్రమే ఈయబడుటలేదు) కొందరికి మాత్రమే విధించబడుటలో ఎవరికిని ఎట్టి నష్టములేదు కదా! మరియు ఎవరికిని ప్రత్యేక లాభముకూడా లేదుకదా! ఒక చిన్న ఉదాహరణము : పదిమంది పిల్లలు ఒకచోట ఆడుకొనుచున్నారు. ఈ పదిమందికి పది పంచదారబిళ్ళలను పళ్ళెములోపెట్టి ఒక వ్యక్తి తీసుకివచ్చినాడు. పిల్లలలో ఇద్దరు వ్యక్తివద్దకు వచ్చినారు. ఆ ఇద్దరితో వ్యక్తి "మీరు వెళ్ళి మిగిలిన పిల్లలకు వారువచ్చి ఈ బిళ్ళలను తినమని చెప్పండి" అని చెప్పినాడు. ఆ ఇద్దరూ వెళ్ళి మిగిలిన పిల్లలకు చెప్పినారు. అందరును వచ్చి పది బిళ్ళలను పదిమంది తిని ఆనందించినారు. ఆ ఇద్దరు పిల్లలకు ప్రత్యేకముగా అధికముగా బిళ్ళలు ఈయబడలేదు. వారు పోయిచెప్పినందుకు వారికి అధిక ఫలమేమియును లేదు. ఈ పదిమంది పిల్లలు పూర్వకాల ప్రజలు. ఆ ఇద్దరు పిల్లలు పురుషబ్రాహ్మణులైన ఋషులు. ఆ పంచదార బిళ్ళలు సత్యమైన (యోగరూఢ) గాయత్రి ఉపనయనములు. ఆ ఇద్దరికి ఇచ్చిన ఆదేశమే అసత్యమైన (రూఢ) ఉపనయన సంస్కారకర్మ. ఈ సన్నివేశమే కలియుగములో ఎట్లు జరిగినదో చూడుడు. పళ్ళెములో తెచ్చిన పంచదారబిళ్ళలను పిల్లలకు అసలు కనిపించుటలేదు. ఆ ఇద్దరు పిల్లలు బట్టీ బ్రాహ్మణులు. వ్యక్తి మాట్లాడిన భాష వారిరువురికిని, ఇతర పిల్లలకును తెలియదు. ఆ ఇద్దరు పిల్లలు వెళ్ళి మిగిలిన పిల్లలతో "ఆ వ్యక్తి మా ఇరువురికి పంచదార బిళ్ళలను ఇచ్చినాడు. మీకు లేవు" అని చెప్పినారు. దీనితో ఆ ఇరువురిపై మిగిలిన వారికి ద్వేషము విజృంభించినది. ఆ ఇద్దరు, వ్యక్తి తమతో మాట్లాడుటయే

పంచదారబిళ్ళలుగా భావించినారు. అనగా సద్గురువును గానముతో స్తుతించి, అగ్ని కార్యముతో సేవించి, బ్రహ్మజ్ఞానమును పొందవలయును అను ఉపదేశమును ఏ మాత్రము అర్థము చేసుకొనక ఆ ఉపదేశమే నిజమైన ఈశ్వరారాధనము అని భ్రమించి మిగిలిన కులములకు 'ఇది లేదు' అని అజ్ఞానమును బట్టీబ్రాహ్మణులు ప్రజలకు ప్రచారము చేసినారు. భాష ఎవరికినీ తెలియనందున పదిమంది పిల్లలలో ఏ ఒక్కరికినీ అసలు ఉపదేశము (పంచదారబిళ్ళ) అందలేదుకానీ, పిల్లలలో ద్వేషము, మరియు కలహము మాత్రము ఏర్పడినవి.

**ఉపసంహారము :**

బ్రహ్మజ్ఞానబోధ చేయుటకు అవతరించిన పరమాత్మయే సద్గురువు. ఆయనను జ్ఞానయోగముతో గుర్తించి భక్తియోగముతో గానముతో స్తుతించి సేవలద్వారా సేవించి ఆయననుండి పొందిన బ్రహ్మజ్ఞానమును ప్రచారముచేయు క్రియయొక్క వివరణమే ఉపనయన, సంధ్యావందన, గాయత్రీజప, అగ్నికార్య, హోమముల సారాంశము. వేదమనగా జ్ఞానము. అధ్యయనమనగా జ్ఞానమే. వేదాధ్యయనమనగా వేదార్థమును తెలుసుకొనుట అని రెండు సార్లు నొక్కివక్కాణించబడిన విషయమేకానీ అర్థము ఏమాత్రము తెలియక వేదమును బట్టీపట్టుట కాదు. మరల మూడవసారికూడా వేదార్థమును తెలుసుకొనమని శాస్త్రబోధ (వేదో ఽధ్యేతవ్యోజ్ఞేయశ్చ). సంస్కృతము రానందున ఈ విషయముకూడా సంస్కృతములోనే ఉన్నందున ఆదినుండి తుదివరకు అజ్ఞానమే మిగిలిన ఈనాటి బ్రాహ్మణులు మొట్టమొదట చేయవలసిన పని సంస్కృతమును నేర్చుకొని వేదశాస్త్ర విషయములను నిశితముగా తెలుసుకొనవలెను. వేదము చెప్పిన విషయములను తెలియక, సొంత కవిత్వముతో విపరీతార్థములను సృష్టించినందున హిందూ మతము చాల దెబ్బతిన్నది. బాల్యములో గాయత్రీ ఉపదేశమును చేయుట అనగా బాలురు గానములో బాగుగా రమింతురు కావున వారిని భక్తిగీతములద్వారా భగవంతుని వద్దకు చేర్చి ప్రహ్లాదునివలె తయారుచేయుటయే నిజమైన ఉపనయనము. ఇక ఉపనయనమను సంస్కారకర్మలో సద్గురు స్వరూపము, ఆయనను గానముతో స్తుతించుట, క్రియారూప సేవలు చేయుట అను విషయములను జ్ఞానప్రచారము కొరకు బోధించుటయేతప్ప ఇందులో పరమాత్మను ఆరాధించు ప్రత్యేక విధానమేమియును లేదు. గాయత్రి అనగా గాన రూపమైన ఉపాసన విధానమే

తప్ప స్త్రీదేవతారూపము కాదు (గాయత్రీఛనః). ఉపాస్య దేవత సవితయనబడు సద్గురువే (సవితాదేవతా). ఇది జ్ఞానబోధయేఅను జ్ఞానబోధలేనందున గుడ్డిగా గొఱ్ఱెలవలె వివాహ వేడుకలవలె విందులు చేసుకొనుచున్నారు. బాలునకు ఏమాత్రము విషయము తెలియక పూర్తిగా అయోమయములో పడి కొత్తదుస్తులను ధరించి వేడుకలలో పాల్గొనుచు, అర్థము తెలియని గాయత్రీమన్త్రమును జపించుచూ, ఎప్పుడు ముగియునా అను ఉత్కంఠతో, ఇతర బాలురతో క్రీడించ వలయునని ఉత్సాహముతో ఉన్నాడే తప్ప జ్ఞానభక్తులతో సద్గురుసేవతో దైవమునకు సామీప్యమును సంపాదించు లక్ష్యార్థముగల ఉపనయన అర్థగంధము ఏమాత్రము లేకయున్నాడు. స్త్రీలు మధుర గానప్రవీణులు కావున తల్లియే గానరూపమున గాయత్రినుపదేశించవలయును. పాటలతో వ్రతములను చేయు స్త్రీలవద్దనే స్త్రీరూపమైన గాయత్రి ఉన్నది. గాయత్రీమన్త్రమును గొణుగుటవలె జపించు బ్రాహ్మణపురుషుల వద్ద గాయత్రి లేదు. ఈ విషయము కూడా బ్రాహ్మణ పురుషుల బుఱ్ఱలలోనికి ఎక్కకపోవుట స్త్రీ నిషేధానంతరము గాయత్రివారికిచ్చిన శాపమే. ఉపనయనమునకు ముందు సంస్కృతమును బోధించినచో ఉపనయనార్థము చక్కగా తెలియును. మహమ్మదు కొండవద్దకు పోవలెను లేదా కొండ మహమ్మదు వద్దకు రావలెను. రెండవది అసాధ్యము కావున మొదటి విధానమే సులభము. అట్లే నీవు సంస్కృతమును నేర్చుకొనవలయును లేదా సంస్కార కర్మలన్నియును నీ మాతృభాషలో చేసుకొనవలెను. మొదటిది కష్టసాధ్యము కావున రెండవది సులభము. ఋషులు వేదములను బట్టీపట్టిన తరువాత వాటి అర్థమును చక్కగా అధ్యయనము చేసిరి. బట్టీపట్టుటకు కారణము ఆనాడు వ్రాతసౌలభ్యము లేక ఉండెను కావున వేదములు బట్టీపట్టుటద్వారానే నిలచియుండెను. మరియు దీనిద్వారా వేదములలోనికి ఎవరును సొంత వాక్యములను చేర్చుటకు వీలుకాకుండెను. నేడు వేదములు ముద్రితములై గ్రంథరూపములో రక్షితములైయున్నవి. వేదము జ్ఞానస్వరూపమే కావున నీవు వేదగ్రంథమును చదివి అర్థమును బోధించవచ్చును. అర్థమే ప్రధానము కావున ఇట్లు చేయవచ్చును. ఇతర మతములును ఇట్లే చేయుచున్నవి కదా!

– శ్రీ శ్రీ శ్రీ దత్తస్వామి



**పురోహితులగు**
**బ్రాహ్మణోత్తములారా!**
**శ్రీ దత్త స్వామి ఉపన్యాసము**
**(తెలుగు అనువాదము)**

**'ప్రవృత్తించ నివృత్తించ జనా న విదు రాసురాః'** అని గీతలో భగవానుడు చెప్పియున్నాడు. దీని అర్థము –'రాక్షస స్వభావముగల ఈ మానవులకు మోక్ష మార్గమే కాదు, లౌకిక మార్గము కూడ తెలియదు' అనియే. రాక్షస స్వభావము అనగా – స్వయముగా తెలియదు, పరులు చెప్పినది వినరు అనియే. అజ్ఞానముతో కూడిన అహంకారమే దీనికి కారణము. లౌకిక కర్తవ్యములగు వివాహము మొదలగు శుభకార్యములు ఎట్లు చేయవలెనో తెలియక, అవసరమైనది చేయక, అనవసరమైనది చేయుచు, ప్రవృత్తిలో కూడా మూఢులగుచున్నారు. మధ్యతరగతి కుటుంబమునకు చెందిన ఒక భక్తుడు లక్షన్నర కూతురికి కట్న కానుకల క్రింద ఇచ్చి, ఐదు లక్షలు పెట్టి పెళ్ళి చేసినాడు. దీనికి తారుమారుగా చేయవలెను. ఐదు లక్షలు కూతురికి ఇచ్చి లక్షన్నరతో పెళ్ళి చేయవలెను. అసలు ఆరు లక్షలు కూతురికి ఇచ్చి, అరలక్షతో పెళ్ళి చేయుట ఉత్తమము. ఒకరు 'ఎంత ఎక్కువ ఖర్చు చేసిన అంత ప్రేమ కూతురిపై ఉన్నట్లు' అని అన్నారు. ఈ మాట ఎంత మాత్రము నిజము కాదు. ఎంత కూతురి పేరు మీద పెట్టినావో అంత ప్రేమ కూతురిపై ఉన్నది అనుట ముమ్మాటికి నిజము. నీవు ఖర్చు పెట్టినదంతయు నీ అహంకారమును వ్యక్తము చేయు ఆడంబరమే కాని ఇది నిజముగా ప్రేమ కాదు. ఇట్టి భావమే రాక్షసత్వమని గీతావచనము (**ఈశ్వరోహమహం ...**). 'ఇట్లు ఖర్చు పెట్టుట జీవితములోని మధురస్మృతి' అని కొందరు వాగుచుందురు. ఇట్లు వాగువారిలో రెండు వర్గములున్నవి. మొదటి వర్గము– పెళ్ళి ఖర్చులో దోచుకొనిపోవు మేళము, పూల పందిరి మొదలగు వ్యాపారులు. వీరు తమ వ్యాపారము సాగుటకై ఇట్టి మాటలు కల్పించినారు. వీరు వ్యాపార వృద్ధికై ఇట్లు చెప్పుటలో కొంత న్యాయమున్నది. ఇక రెండవ వర్గము వారు బంధు మిత్రులు. వీరు ఇట్లు చెప్పుటకు కారణము–పెళ్ళి ఖర్చు చేత నీవు నలిగి బీద వాడైనచో నీ కన్న

వారు సంపన్నులుగా పై స్థాయిలో ఉండగోరుటయే. ఇట్టి కోరిక వారికి తెలియకయే అంతరాత్మలో దాగియుండును. దీనిని అవ్యక్త ప్రాక్తన సంస్కారమందురు (sub-conscious state). దీని వలన అకారణముగా కొన్ని మాటలు పలుకుట, కొన్ని పనులను చేయుట జరుగుచుండును. కన్యాదాత మనస్సులో కూడా అతడు గుర్తించని సంస్కారము దాగి యుండును. అట్టి సంస్కారము ఏమనగా – అతని మనస్సులో కీర్తి కాంక్ష దాగి యుండును. పది మంది తన చుట్టూ చేరి తాను చేయు ఘనకార్యమునకు ప్రశంసాభావముతో తన చుట్టూ జనులు చేరి యుండవలయుననియే. అట్టి అవకాశము తాను ఏదో ఒక లోకోద్ధరణ కార్యము చేసినపుడు జనులు అట్లు చుట్టూ చేరవలయును గానీ ఈ విధముగా కాదు. కానీ తన జీవితములో అట్టి అవకాశము లేనపుడు ఈ విధముగానైనను సంతృప్తిపడు అవకాశముగల కీర్తికాంక్షయే దీనికి అసలు కారణము. ఈ కారణమును కప్పిపుచ్చి 'కూతురిపైగల ప్రేమతో పెళ్ళి బాగుగా చేయుచున్నాను' అని పలుకుచుండును. ఈ సంస్కారము చాలా మందికి తెలియకపోవుట వలన, అది వారిలో ఉన్నట్లు ఎవరైననూ చెప్పినను అంగీకరించజాలరు.

నీవు నీ స్థాయిని అనుసరించి ఖర్చు చేయవలెను. ధనవంతులను అనుసరించి పులిని చూచి నక్క వాతపెట్టుకొన్నట్లు చేయరాదు. అట్లు అనుకరించి మధ్య తరగతి కుటుంబీకులు అప్పులపాలై అలమటించుచున్నారు. సంపన్నులు కూడా 100 కోట్లు కట్నకానుకల నిచ్చి 5 కోట్లు పెట్టి పెళ్ళి చేయుచున్నారు. అనగా కట్నములో 20వ వంతు పెళ్ళి ఖర్చు చేయుచున్నారు. కాని మన మధ్య తరగతి వారు కట్నకానుకల కన్న 20 రెట్లు పెళ్ళి ఖర్చు చేయుచున్నారు! కట్నకానుకల నిషేధముపై నినాదము చేయుచున్నవారు అనవసర పెళ్ళి ఖర్చుల నిషేధముపై ఏల నినాదము చేయరు? కట్నకానుకలను దాచుకొను అవకాశము కలదు. కాని జారిపోయిన పెళ్ళి ఖర్చులకు అట్టి అవకాశమే లేదు కదా! నీవు ఆరు లక్షలను కూతురి పేర పెట్టినచో అది ఎన్నో రెట్లు అగును. ఆమె కష్టములలో అక్కరకు వచ్చి ఆమె జీవితము మధురముగనుండును. కష్టములు వచ్చినపుడు ఆ మధుర స్మృతిని ఎంత తలచినా కష్టములు పోవునా? దోచుకొని పోయిన మేళము, పూల పందిరి వారు వచ్చి కష్టములను తీర్చెదరా?

నీవు పెళ్ళి చేయునపుడు బంధు మిత్రులను పిలచి అన్న వస్త్రాది దాన మర్యాదలను చేయుచున్నావు. దానము అపాత్రులకు చేసినచో పాప ఫలము వచ్చి, వధూవరులు కష్టముల పాలు అగుదురు. పాత్రులకు ఇచ్చినచో పుణ్యము వచ్చి వధూవరులు సుఖపడుదురు. పాత్రులకు దానము చేయక పోవుట, అపాత్రులకు దానము చేయుట–ఈ రెండునూ పాపములని భారతములో వ్యాస వచనము. నీవు పెండ్లికి పిలచినపుడు పాత్రులు ఎవరు అను విచక్షణతో పిలువలేదు. కేవలము గుడ్డిగా బంధు మిత్రులను పిలచినావు. వారిలో చాలా మంది నిజముగా అపాత్రులే. నివృత్తిలోనే కాదు, కనీసము ప్రవృత్తిలో కూడా ధర్మము లేనివారే. ఇట్టి వారి ఆశీస్సులతో వధూవరులు అనేక కష్టముల పాలగుచున్నారు. కావున గీత ఆరంభములో గుడ్డి బంధు వ్యామోహముతో నున్న అర్జునుని వలె కాక, విచక్షణతో పరులైనను పాత్రులను పిలచి సన్మానించినచో వధూవరులు సుఖింతురు. అట్టి పాత్రులు దొరకనిచో బిచ్చగాండ్రకు అన్న దానము చేయుము. వారు కనీసము అన్నము పారవేయక తిందురు. వడ్డించిన ఆహారమును కణము కూడా పారవేయక తినుటయే భోక్త యొక్క కనీస యోగ్యతా లక్షణమని వేద శాసనము (**అన్నం న పరిచక్షీత ...**). ఈనాడు పెళ్ళి విందులో ఎంత ఆహారమును పారవేయుచున్నారు! ఒకచోట విందు జరుగుచున్నది. గోడకు ఇటు వైపు ఆహారమును పారవేయుచు కొందరు విందును ఆరగించుచున్నారు. గోడకు అటు వైపు పారవేసిన ఆహారమును బిచ్చగాండ్రు వెతికి వెతికి తినుచున్నారు. అప్పుడు అచ్చట ఉన్న శ్రీ సత్యసాయి భగవానుని ఒక భక్తుడు ఇలా ప్రశ్నించినాడు. 'ఏమిటి ఈ సృష్టి వైపరీత్యము! ఒక వైపు అట్లు పారవేయుట! మరొక వైపు అట్లు ఏరుకొనుట!' బాబా ప్రశాంతముగా పలికినారు. 'ఆ ఏరుకొను వారు పూర్వ జన్మమున ఇట్లు పారవేసినవారే. నాడు పారవేసిన దానిని నేడు వెతుకు కొనుచున్నారు'. కావున ఆహారమును పారవేసినవారు మరుజన్మలో బిచ్చగాళ్ళ జన్మ నెత్తుదురు. అంతే కాదు. పెళ్ళి విందును ఏర్పాటు చేసిన కన్యాదాతయు, అట్టి వారిని తీసుకు వచ్చిన వరుని తండ్రియు, ఆ పాపము యొక్క భాగస్వాములై (**కర్తా కారయితాచైవ ...**), ఎన్ని విస్తర్లలో ఆహారము పారవేయబడినదో అన్ని జన్మలు

బిచ్చగాళ్ళుగా పుట్టుదురు. ఆహారమును కణము కూడా పారవేయరాదని వేద వచనములో **(పరిచక్షీత ...)** 'పరి' అను ఉపసర్గ బోధించుచున్నది. అట్లే ధనమును పైసయు దుర్వినియోగము చేయరాదు. అట్లు చేసినచో దరిద్రులుగా జన్మింతురు. కూతురికి ఇచ్చుట, పాత్రులకు ఇచ్చుట, బిచ్చగాళ్ళకు దానము చేయుట ధన సద్వినియోగము. అపాత్ర దానము, అనవసరముగా స్థాయికి మించిన ఖర్చు ధన దుర్వినియోగము.

అన్నమును పారవేసినవారు అన్నపూర్ణను, ధన దుర్వినియోగము చేసినవారు లక్ష్మీదేవిని, అవమానము చేసిన వారు కావున శివకేశవుల క్రోధమునకు గురి అగుదురు. కన్యాదాత, వర పక్షము వారిని తన శక్తి భక్తుల ననుసరించి అతిధి మర్యాదలను చేయుచున్నాడు. అతిథి దైవ స్వరూపమని వేద ధర్మము. ఈ మర్యాదలే పెళ్ళి ఖర్చు యొక్క స్వరూపము. మర్యాదలను ఎవరైనను సహజముగా మన:స్ఫూర్తిగా చేయవలయునేగాని, ఫలానా మర్యాదలు చేయవలయునని అడుగరాదు. అడిగి బలవంతముగా చేయించుకొన్నవి మర్యాదలు అనబడవు. అభిమానముతో మనఃస్ఫూర్తిగా చూపించు భక్తి గౌరవములే నిజమైన మర్యాదలు. కన్యాదాతచేయు సహజమైన మర్యాదలను మంచి దృష్టితో స్వీకరించుటయే ఉత్తమ సంప్రదాయము.

**వివాహముయొక్క ముఖ్య ఉద్దేశ్యము:** అచ్చట చదువు మంత్రముల యొక్క అర్ధములను తెలుసు కొనుటయే. వివాహ సంస్కారము యొక్క ప్రధాన లక్ష్యము: గృహస్థాశ్రమములో ధర్మార్ధ కామములకును తరువాత వానప్రస్థములో మోక్ష సాధనకు కావలసిన అన్యోన్య సహకారమునకు మూలమైన దైవానుగ్రహమును దైవ స్తుతులచే సాధించుకొనుటయే. ఆ దైవ స్తుతులే వివాహ మంత్రములు. కానీ, మంత్రముల యొక్క అర్ధములను పురోహితుడు తెలియక పోవుటచేత ఆ అర్ధముల యొక్క వివరణములు అందించబడుటలేదు. కావున ప్రధాన లక్ష్యముపై ఉండవలసిన దృష్టి ఎప్పుడో జారిపోయినది. అనవసరమైన ఇతర లక్ష్యములు అచ్చట చోటుచేసుకొన్నవి. అవియే వేడుకల ఆడంబరములు, బహుమతుల వ్యాపారము, పరస్పర ఆక్షేపణములు, కన్యాదాతను బెదరగొట్టు విమర్శలు మొదలగునవి. ఈ విధముగా ఈ వివాహ సంస్కారము భ్రష్టమైనది. దీనికి మూలకారణము పురోహితుడు కేవలము వేదమును బట్టీపట్టి వేదార్ధమును తెలియలేక వివరించలేక

పోవుటయే. ఇతర మత గ్రంథములు వారి మాతృభాషలో ఉండుట చేత ఇతర మతస్థులు సంస్కారములు చేసుకొనునపుడు వారికి ఈ దు:స్థితి పట్టలేదు. హిందూమతములో ప్రాచీన ఋషులు తమ మాతృభాష సంస్కృతము కావున ఈ మంత్రములను ఎట్టి వివరణలేకయే అర్ధము చేసికొనెడివారు. కాని ఈనాడు సంస్కృత భాష పురోహితులకే రాదు. కావున మంత్రార్ధ వివరణకు ఎట్టి అవకాశములేక దురాచారములకు దారితీయుచున్నది.

**ఉదాహరణమునకు:** ఆబ్దికమునకు వచ్చిన భోక్తలు అన్నసూక్తమును పఠించుచు దాని అర్ధము తెలియక ఆహారమును పారవేయుచున్నారు. భోజనముకు ముందే యజమాని 'నీకు ఇష్టమైనది ఉంచుకొని ఇష్టము కాని దానిని త్యజించుము' అని చెప్పుచున్నాడు **(యత్ రోచతే ...)**. ఈ వాక్యము సంస్కృతములో ఉండుటచే ఎవరికిని అర్ధమగుటలేదు. ఈ వాక్యము ప్రకారముగా భోక్తలు ఇష్టము కాని పదార్ధములను ఎంగిలి చేయకముందే దొప్పలో ఉంచవలెను. వారి భోజనము తరువాత ఈ దొప్పలో ఉన్న పదార్ధములను గురించి యజమాని 'వీటిని ఏమి చేయవలయున'ని ప్రశ్నించును **(అన్న శేషః కింక్రియతాం ...)**. అప్పుడు భోక్తలు వాటిని ఎంగిలి చేయలేదు కనుక 'ఇష్టులతో కలసి భుజించమ'ని పలుకుదురు **(ఇష్టైః సహ భుజ్యతాం ...)**. ఎంగిలి చేసినది ఇతరులు తినరాదు **(యదుచ్ఛిష్ట మభోజ్యం చ...)** కనుకను, ఆహారమును పారవేయరాదు కనుకను **(అన్నం న పరిచక్షీత ...)**, ఈ ఏర్పాటు ఇట్లు చేయవలసి వచ్చినది. ఆపస్తంబ సూత్రములు సూచించిన దొప్ప యొక్క అంతరార్ధమును మనము నేడు పాటించ వలయును. అది ఎట్లు అనగా - నీవు వడ్డించునపుడు భోక్తకు ఇష్టమా కాదా? అని అడిగి వడ్డించుము. లేదా విస్తరి వద్ద ఒక పళ్ళెమును ఉంచి ఇష్టములేని పదార్ధములను ఎంగిలి చేయక ముందే దానిలో ఉంచమని వారికి విన్నవించుము. విందులో కూడా వడ్డన తరువాత కొందరు పళ్ళెములను తీసుకొని తిరుగుచు ఇష్టములేని పదార్ధములను ఎంగిలి చేయక ముందే వాటిలో ఉంచమని తినువారికి చెప్పవలెను. కొందరు పారవేసిన అన్నమును జీవరాశులు భుజించును కావున పుణ్యమేనని కుతర్కము చేయుచున్నారు. అట్లు జీవరాశులకు అన్నము పెట్టుట నీవు తినక ముందే చేయవలయునని వేద వచనము. మరియు పారవేసిన అన్నము భూతరాశులు తినకపోవు అవకాశము కూడా కలదు. అప్పుడు

పారవేసిన అన్నము చెడి రోగకారక క్రిములను పుట్టించుచున్నది. ఆ క్రిములు దైవ భక్తులగు సజ్జనులను రోగములతో బాధించినప్పుడు నీకు పాపము కలిగి దానివలన బిచ్చగాని జన్మమునెత్తుచున్నావు.

వేదార్ధము తెలియక మరియు దానిని చర్చించక పోవుటవలన ఇచ్చట అనేక అపార్ధములు వచ్చినవి. 'ఇష్టములేని దానిని త్యజించుము' అనగా 'తిన్నంత తిని పారవేయమ'ని అపార్ధమును తీసినారు. అట్లు పారవేయుటకే ఆ దొప్పను ఉపయోగించినారు. అట్లు పారవేసిననే భోక్త సంతృప్తి చెందినట్లుయని విపరీతార్ధమును సృష్టించినారు. అన్న శేషము అనగా వంట ఇంటిలో మిగిలిన వంట అని అన్నారు. అది ఎటూ అందరూ తినుటకే వండినది కావున దానికి భోక్తల అనుమతి అవసరము లేదు. వీటినన్నింటిని అన్నము పారవేయరాదన్న వేద ప్రమాణము ఖండించుచున్నది. వేద ప్రమాణమునకు ముందు ఎట్టి వాదములు నిలువజాలవు గదా (**శ్రుతి స్మృతి విరోధేతు ...**)! మరియూ యోగశాస్త్రము ప్రకారము పొట్టకు సగభాగమే భుజించవలయును గదా! అర్ధము తెలియక పోవుట అను అజ్ఞానముతో పాటు జ్ఞానులు చెప్పునది తిరస్కరించుట అను అహంకారము ఏర్పడుట వలన రాక్షసత్వము వచ్చినది. దైవము రాక్షసులను ఎప్పుడునూ శిక్షించుచునే ఉన్నది. అజ్ఞానులగు ఇతరులు తప్పు చేసినచో క్షమించవచ్చును గాని, లోకమును నడిపించవలసిన గురువులే తప్పు చేసినచో క్షమార్హులు కారు. కావుననే పురోహితులకు దరిద్ర బాధ అంటుకొన్నది. అన్నపూర్ణయు ధాన్యలక్ష్మియు అగు అన్నమును పారవేయుట వలన ప్రతిరోజు ఆహారమును అన్వేషించవలసిన స్థితికి దిగజారినారు.

వేదార్ధము తెలియక పోవుటవలన యజ్ఞ స్వరూపము గూడా అపభ్రష్టమైనది. అర్ధము తెలియని వేద పాఠకుడు అధముడని స్మృతియే చెప్పుచున్నది. (**అనర్ధజ్ఞో... పాఠకాధమాః**). అగ్ని మూడు విధములు: లౌకికాగ్ని, వైద్యుతాగ్ని మరియు దేవతాగ్ని. లౌకికాగ్ని అనగా సమిధలతో చేయుమంట. వైద్యుతాగ్ని అనగా విద్యుత్‌కు సంబంధించినది అనగా విద్యుత్ శక్తి. ఇక దేవతాగ్ని అనగా దేవతా స్వరూపమై జఠరములో ఉండు వైశ్వానరాగ్ని అనబడు ఆకలి మంటయే (**అహం వైశ్వానరో భూత్వా ... గీత**). మొదటి రెండు అగ్నులు యజ్ఞ సాధనములు. అనగా వీటి సహాయము చేత ఆహారమును వండ వలయును. ఇట్లు వండిన ఆహారమును

ఆకలి మంట గల వానికి పెట్టుటయే యజ్ఞ పరమార్థమైన హెూమము. ఈ ఆకలి మంటయే దేవతా స్వరూపమైన వైశ్వానరాగ్నియై ఉపాసించబడవలసిన యజ్ఞము యొక్క ఉపాస్యాగ్ని అనబడును. ఇట్లు శ్రేష్ఠమైన ఆహారమగు ఘృతము మరియు అన్నమును ఆకలితో ఉన్నవానికి పెట్టుటయే యజ్ఞము. ఘృతము అనగా నేతితో కూడిన అన్నము లేక నేతితో కలిపి వండబడిన పిండివంట యగు ఆహారమని లక్షణావృత్తి శాస్త్రము ద్వారా గ్రహించవలెను. ఇట్లు గ్రహించక ఘృత శబ్దమును కేవలము నేతిగాను, అగ్ని శబ్దమును లౌకికాగ్నిగాను, అర్ధము తీసుకొని నేతిని నిప్పులలో పోసి తగులపెట్టువాడు మూఢుడని విష్ణు అవతారమగు కపిల ముని భాగవతములో బోధించినాడు. మరియు భాగవతములో కృష్ణ భగవానుడు యజ్ఞములో వండిన అన్నమును అగ్నిలో సమర్పించకముందే ఆకలితో నున్న గోపాలురకు పెట్టమని మునిపత్నులకు బోధించినాడు. అగ్నిలో ఆహారమును దగ్ధము చేయుటయే వేదార్థమైనచో భగవానుడు వేదధర్మమును విరోధించెడివాడా? ఇట్లు ఆహారమును తగులపెట్టు దురాచారము కూడా వేదార్థము తెలియక పోవుటవలననే వచ్చినది. వీరి అన్న దారిద్ర్యమునకు ఇది ఒక కారణము. ఇట్టి యజ్ఞ ధూమము వలన వర్షములు కురియవనియు, దాని వలన కరువులు, వరదలు, వాతావరణ కాలుష్యము మొదలగు ప్రమాదములు వచ్చునని నేటి విజ్ఞాన శాస్త్రము నిరూపించుచున్నది. ఈ ధూమము వర్ష కారణమని పలుకుట ఎంత వెర్రి తనము!

యజ్ఞము విజ్ఞాన శాస్త్రముతో సమన్వయింపబడవలెనని వేదవచనము (**విజ్ఞానం యజ్ఞం తనుతే...**). నాడు జనసమ్మర్దము తక్కువగానుండి వృక్షములు ఎక్కువగా నున్నందున యజ్ఞ ధూమము వాతావరణ కాలుష్యమును కలుగజేయ లేదు. నాడు ఆ ధూమము చేత ఆశ్రమములలో దోమలను పారద్రోలుట, అగ్ని నిరంతరము వెలుగుటచేత క్రూర జంతువులు దూరముగా పోవుట మొదలగు ప్రయోజనములు ఉండి ఉన్నవి. కానీ నేడు అట్టి అవసరములేదు. మరియు వైద్యుతాగ్ని కూడా భౌతికాగ్నియే కావున విద్యుత్ శక్తితో పనిచేయు పోయిని కూడా వంటకు ఉ పయోగించుటలో తప్పు లేదని స్పష్టము. బ్రహ్మజ్ఞుడగు సద్గురువునందు సర్వదేవతలు వసింతురు (**యావతీర్వై...**). అట్టి సద్గురు పురోహితుని ఆకలి మంట నీ ఆహారముచే సంతృప్తి చెందు సర్వ దేవతా తృప్తి వలన వర్షములు కురియును. ప్రాచీన కాలములో

లౌకికాగ్నిని జ్వలింపచేయుటకు కొంచెము నేతిని చక్షుషీ హోమములను పేరున వాడినారు. దీనికి కారణము అగ్నిని జ్వలింపచేయుటకు కిరోసిన్ వంటివి నాడు లేకపోవుటచే, నేతిని వాడినారు. మిగిలిన ఘృతము (ఘృతాహారము) నంతయు ఆకలిగొన్న వారికి ఆహారముగా ఇచ్చుటయే యజ్ఞము. పానీయములను ఇచ్చుట సోమ యజ్ఞము. అల్పాహారమును ఇచ్చుట హవిర్యజ్ఞము. భోజనము పెట్టుటయే పాక యజ్ఞము. ఆకలితో ఉన్న పురోహితుడే అగ్నియని ప్రథమ వేద ప్రథమ మంత్రము (**అగ్ని మీళే ...**). అట్టివానిని మొట్టమొదట ఆహార దానముచే అర్చించమని అగ్ని శబ్దము యొక్క అర్థము కావున అగ్రి శబ్దము నుండి అగ్ని శబ్దము పుట్టినది. గురువగు ఆ పురోహితుడు ఆహారమును స్వీకరించి జ్ఞానమును బోధించు జ్ఞానాగ్ని స్వరూపునిగా చెప్పబడుచున్నాడు (**ఆగ్నేయోవై బ్రాహ్మణః**). కేవల శబ్దమాత్రముగా చెప్పబడు మంత్రముతో చేయు కర్మ, ఫలరహితమని యాస్క మహర్షి వచనము (**అనగ్నావివ**). కావున కేవల వేద ధ్వని ఏమియూ చేయజాలదు. కావున వేదమును బట్టీపట్టుట మానుకొని వేదార్థబోధను చేయు జ్ఞాన యజ్ఞమును నిర్వహించు గురువులుగా పురోహితులు మారవలెను. వ్రాత సాధనములు లేని పూర్వ కాలమున వేదములను కంఠస్థము చేసి పరంపరగా అందించవలసిన అవసరము ఉండి ఉన్నందున, బట్టీపట్టి వేదములను రక్షించుట చేసిన ప్రాచీనులు అభినందనీయులే. నాడు బట్టీపట్టుటతో పాటు వేదార్థ విచారమును కూడా చేసి వేద పాఠకులేకాక వేద పండితులుగాను ప్రసిద్ధినొందిరి (**అధ్యేతవ్యో జ్ఞేయశ్చ ...**). అసలు వేద శబ్దమునకు అర్థమే జ్ఞానమైనపుడు (**విదుల్ జ్ఞానే ...**) వేదార్థము ఎంత ముఖ్యమో ఆలోచింపుడు.

ఉపనయనములో గాయత్రీ మంత్రోపదేశము కూడా అర్థము తెలియక వెర్రి దోవలకు దారి తీసినది. ఉపనయనము అనగా జీవుని దైవము వైపునకు త్రిప్పుటయే. జీవులను దైవము వైపునకు నడిపించు వాడే బ్రాహ్మణుడని శబ్దార్థము (**బ్రహ్మ నయతి ఇతి బ్రాహ్మణః**). గాయత్రి అనగా గానముచే దైవమును ప్రార్థించుటయే (**గాయంతం త్రాయతే ...**). అనగా ప్రతి జీవునకు బాల్యములో భగవంతుని గురించిన గానమును నేర్పించుటయే ఉపనయనము మరియు గాయత్రీ మంత్రోపదేశము. దీనికి కులము మరియు లింగముల విచక్షణ లేదు. ఒకానొక వైదిక ఛందస్సు పేరు గాయత్రి (**గాయత్రీ ఛంధః**). గాయత్రి, దేవతా నామము కాదు. సృష్టిని చేయు సవితయనబడు

భగవంతుడే దేవత (**సవితా దేవతా...**). ఇట్లు వేదార్ధ విచారమును చేయక గాయత్రి అనగా దేవతయనియు, గాయత్రీ ఛందస్సులో గల ఒకానొక పద్యమును గాయత్రీ మంత్రమనియు, అది కేవలము ఒకానొక కులములో గల పురుషులకు మాత్రమే వర్తించుననియు అపార్ధము చేసి హిందూమతములో కుల ద్వేషమునకు, లింగ వివక్షతకు దారిజూపి, హిందూమతములో ఐకమత్యమును పాడుచేసియున్నారు. గానమయమై, అర్ధము తెలియు మాతృభాషలో పదే పదే ఉచ్చరింపజేయు భగవంతుని గుణగానమే గాయత్రీ మంత్రము. వీరు చెప్పు గాయత్రీ మంత్రములో గానమేలేదు. అర్థము తెలియదు. మనస్సునకు ఆకర్షణ లేదు. బలవంతముగా పదే పదే ఉచ్చరించుట చేత అది గాయత్రీ మంత్రమే కాదు. మనస్సును ఆకర్షించి పదే పదే మననము చేయించు దైవగానమే గాయత్రీ మంత్రము. అప్రయత్నముగా మనస్సును ఆకర్షించునదియే మంత్రము (**మననాత్ ఇతి**). అట్టి ఆకర్షణమును కలుగజేయు శక్తి వచనముకన్నను, పద్యముకన్నను గానమునకే ఎక్కువ కలదు. కావున గానాత్మకమైన భగవంతుని గీతము సర్వ శ్రేష్ఠమని చెప్పుటయే గాయత్రి యొక్క శ్రేష్ఠ తత్త్వము. అందుకే వచనమైన యజుర్వేదముకన్నను, పద్యమైన ఋగ్వేదము కన్నను, గానమైన సామవేదమే సర్వ శ్రేష్ఠమైనది (**వేదానాం సామవేదోస్మి - గీత**). విశ్వములోగల అన్ని భాషలకు ఇది వర్తించును కావున విశ్వ జనులకు అందరికిని హితముచేయు బోధకుడే విశ్వామిత్రుడు అనబడుచు దీనికి ఋషి అయి ఉన్నాడు (**విశ్వామిత్ర ఋషిః**).

వేదార్థమును బోధించిననాడు పురోహితుడు ఆచార్యుడై వెలుగునని వేదధర్మము (**ఆచార్యవాన్ పురుషో వేద...**). ఉదాహరణకు: ఉపనయనములో మూడు పోగులుగల యజ్ఞోపవీతమును ధరించుటలో త్రిగుణ స్వరూపమైన ప్రకృతి రూపమగు మనుష్య తనువును ఆశ్రయించిన పరబ్రహ్మమగు సద్గురువును ఆశ్రయించి గానముతో కీర్తించవలయునని చెప్పుటకై జందెమును పట్టుకొని గాయత్రిని జపించుటలోని అంతరార్థము. ఊహలకు సైతము అందని పరబ్రహ్మము, త్రిగుణ ప్రకృతి రూపమును ఆశ్రయించి అవతరించునని బోధించుటయే బ్రహ్మోపదేశము. సాక్షాత్తు పరబ్రహ్మమును పట్టలేము కావున అది ఆశ్రయించిన ప్రకృతి–ఉపాధిని ఆశ్రయించుటచేత పరబ్రహ్మముయొక్క సమీపమునకు (ఉప) పోగలమే (నయనము) తప్ప అన్య మార్గము లేదు. సూర్యోపస్థాన ప్రకరణములో అచేతన ప్రకృతి రూపమగు

సూర్యుని, పరబ్రహ్మకు ప్రతీకగా (**ఆదిత్యం బ్రహ్మేతి...**) ఉపాసించుట విషయము. ఆదిలోనే త్రిగుణ ప్రకృతి రూప మానవ రూపమగు సద్గురువును అన్వేషించుట కష్టముగాన, అచేతన ప్రకృతి రూపమును ప్రతీకగా ఉపాసించునప్పుడు సృష్టి అంతయు త్రిగుణ స్వరూపమే కావున మూడు పోగుల జందెము ఇచ్చుట కూడా సమన్వయించును. బ్రహ్మచర్యమునుండి తిరిగి వచ్చిన తరువాత (సమావర్తనము), సద్గురువును ముక్తి మార్గమునకు అన్వేషించుట వేదోక్తము (**సగురు మేవాభి గచ్ఛేత్**). ఇట్లు మంత్రములను ఆయా ప్రకరణ విషయములకు అనుసంధానము చేసి అన్వయించి వివరించవలయును. ప్రకరణార్ధమే తెలియనివారు ఇక మంత్రార్ధ సమన్వయమును ఎట్లు చేయగలరు? ఇట్లు అసలు అర్ధము తెలియకపోవుట వలన వేడుకలు దూరి ఈ సంస్కారములను పెడద్రోవను పట్టించుట వలన బ్రహ్మజ్ఞాని అగు వటువును సైతము 'వడక పెళ్ళికొడుకో'ని పిలుచుచున్నారు!

వివాహమును జరిపించునపుడు స్నాతకము, వరపూజ, స్థాలీపాకము, నాకబలి, హోమము అనునవి ముఖ్య ప్రకరణములు. స్నాతకము అనగా బ్రహ్మచర్యాశ్రమమును ముగించి జ్ఞానియై బయటకు వచ్చుటయే. వేదవచనము ప్రకారముగా పరబ్రహ్మస్వరూపుడగు సద్గురువును అన్వేషించుచు సంన్యాసాశ్రమమునకు బయలుదేరుటయే (**తదహరేవ ప్రవ్రజేత్...**). అట్లు అన్వేషించుచు శంకరులు గోవింద భగవత్పాద సద్గురువులను ఆశ్రయించినారు. కానీ ఈ మార్గము భగవదవతార పురుషులగు శంకరాదులకే సాధ్యము. ఈ మార్గములో ధర్మార్ధ కామములు త్యజించబడుచున్నవి. కేవలము మోక్ష మార్గమగు సంన్యాసమే సూచించబడుచున్నది. ఇది సామాన్య జీవులకు అసాధ్యము. ఈ తత్త్వమును తెలియక స్నాతకుడైన యువకుడు ఆవేశముతో సంన్యాసమునకు బయలుదేరుటయే కాశీ యాత్ర. కాశీ యనగా జ్ఞానముతో ప్రకాశించు సద్గురు స్వరూపమే (**కాశతే ఇతి...**). అట్టి సద్గురువును చేరుటకు చేయు ప్రయాణమే కాశీ యాత్ర. సామాన్య జీవుడగు యువకుడు దానిని సాధించలేక పతితుడగునను ఆశయముతో ఆచార్య ప్రేరితుడై కన్యాదాత, అట్టి యువకుని 'గృహస్థాశ్రమమును ప్రవేశించి, ధర్మార్ధ కామములను నిర్వర్తించి, భార్యా సహాయుడై మోక్ష మార్గమును సాధించు వానప్రస్థమును ప్రవేశించమ'ని బోధించుచున్నాడు. అట్టి స్నాతకునకు కన్యాదానము చేసి, వాని క్రమముక్తి మార్గమునకు సహాయపడు

కన్యాదాత, వరుని, సత్పాత్రుడగుట వలన లక్ష్మీనారాయణ స్వరూపునిగా భావించి, సత్పాత్రదానము యొక్క పుణ్యమును ఆర్జించుటకై వరపూజను చేయుచున్నాడు. ఈ క్రమముక్తి మార్గములో కూడా తుదకు దైవాన్వేషణయే లక్ష్యము. వానప్రస్థములో భార్య ఆహారమును వండి పెట్టుటచేత, భిక్షాటన క్లేశము లేక కాలమును సత్సంగముతో సద్వినియోగము చేసుకొనవచ్చును. సంన్యాసాశ్రమములో భిక్షాటనలో కొంతకాలము వ్యర్థమగును. అందుకే తన శిష్యుడగు మండనమిశ్రుని భార్యయగు ఉభయభారతిని శంకరులు తమ వెంట ఉంచుకొని భిక్షాటన కాల క్లేశమును పరిహరించి, సర్వకాలమును జ్ఞాన చర్చలతో గడిపినారు. ఇట్టి సహకారమును కన్య చేయగలదు అని నిరూపించుటయే స్థాలీపాక ప్రకరణము. గిన్నెతో వంట చేయుటయే స్థాలీపాకము. దీనిని జ్ఞానులకు నివేదించటయే నాకబలి అర్ధము. నాకము అనగా స్వర్గము. నాకము చేత స్వర్గవాసులగు దేవతలు చెప్పబడుచున్నారు. వారికి ఆహారమును నివేదించుటయే నాకబలి. ఉభయభారతి వంటచేసి శంకరులకు, వారి శిష్యులకు వడ్డించెడిది. వంటచేయునపుడు భార్య సత్సంగములో పాల్గొనలేదు. కావున ఆ సత్సంగ సారమును భర్త తన భార్యకు వివరించ వలసిన ఆధ్యాత్మిక బాధ్యతను స్వీకరించుటయే మరియొక జందెమును ధరించుట. సంన్యాసము, ఒంటరిగా నడచు కాలి నడక వంటిది. గృహస్థాశ్రమములో ఇట్టి సౌకర్యము ఉండుటవలన త్వరగా గమ్యమును చేరు అర్థమే వివాహ శబ్దమునకు కలదు (**విశేషో వాహః**). ఒక విశేష వాహనము ద్వారా గమ్యమును చేరుటయే వివాహము. ఇక హోమము అనగా ఆకలిమంటయగు జఠరాగ్ని స్వరూపమైన వైశ్వానరాగ్నిలో ఆహారమును సమర్పించుటయే కాని నిప్పులో నేతిని పోయుటకాదు. ఈ విధముగా వివాహము యొక్క అంగములన్నియు దైవమే లక్ష్యముగా కలిగి దైవ స్తుతి స్వరూపమగు జ్ఞాన యజ్ఞముగా ఆచార్యుడు జనులకు వివరించుటయే వివాహముయొక్క ముఖ్య లక్ష్యము. ఈనాడు ఈ లక్ష్యముయొక్క అణుమాత్ర జ్ఞానము కూడా తెలియక, కేవలము లౌకికములైన వేడుకలగా వివాహము ముగియుట హిందూమతముయొక్క అత్యంత శోచనీయమైన దురవస్థ.

కావున పురోహితులగు బ్రాహ్మణోత్తములారా! లెండు. మేల్కొనుడు. వేదములను బట్టీపట్టుట మానుడు. నేడు వేదములు ముద్రితములై సురక్షితముగనే ఉన్నవి. కావున మీరు వేదార్థమును విచారము చేయుటకు సంస్కృతమును నేర్చుకొని,

శాస్త్రములను మధించి, వేద పండితులుగా మారి హిందూమతములోని అన్ని సంస్కార క్రియలను జ్ఞాన యజ్ఞములుగా తెలుసుకొని, సర్వ జనులకు బ్రహ్మ జ్ఞానమును బోధించి, భగవత్ భక్తిని పెంచి, హిందూమతమును ప్రాచీన సనాతన స్థాయికి చేర్చి మీరు బ్రహ్మర్షులుగా ప్రకాశించండి. కేవలము బట్టీపట్టి వేదములను చదివి, ద్రవ్యములతో కర్మలను చేయించి కూలీని సంపాదించు కూలీలుగా జీవించవలదని బోధించిన యాస్క మహర్షి హితోపదేశమును గుర్తు తెచ్చుకొనుడు (**స్వర్ణ భార హరః**). ఇట్లు బట్టీపట్టిన వారు దేవ పశువులనియు, బ్రహ్మర్షులగు బ్రాహ్మణులకు బంధువులు మాత్రమే తప్ప బ్రాహ్మణులు కాదనియు వేదమే ఆక్షేపించుచున్నది (**దేవానాం పశు రహహ..., బ్రహ్మబంధురివ...**). పురోహితుడు జ్వలించు అగ్నియని ఋగ్వేదముచే ఆదిమంత్రములో కీర్తించబడుచున్నాడు. అట్టి పురోహితుడు జ్ఞానమును వదలి, వేదమును కేవలము బట్టీ పట్టి చదువుటచేత ఎంత నవ్వులపాలు అయినాడో ఆలోచించండి. పురీషము, రోషము, హింస, తస్కరుడు అను నాలుగు శబ్దములయొక్క ఆద్యాక్షరములే పురోహితుడని ఆక్షేపించుట ఎంత బాధాకర విషయము (**ఆద్యాక్షరాణి సంగృహ్యా చక్రేధాతా పురోహితం...**). మండుచున్న నిప్పులవలె ప్రకాశించు బ్రహ్మర్షులు, నాడు జనులచే ఎంత గౌరవించబడినారు! నేడు అవే నిప్పులు చల్లారి బొగ్గులై, బూడిదయై జనుల పాదములచే తొక్కబడుచున్నారుగదా (**జ్వలితం న హిరణ్య రేతసం, చయమాస్కందతి భస్మనాం జనః - భారవి**)!.

**శ్రీ దత్త స్వామి వారు (శ్రీ జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి)** హిందూమతోద్ధరణమును గురించి ఇచ్చిన దివ్యోపన్యాసములలో నుండి గ్రహింపబడిన ప్రథమోపన్యాసము.





# శ్రీ దత్తస్వామి

( జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి )